# ఎవరితో ఎలా మాట్లాడాలి?

## (రామాయణంలో హనుమంతుడు)



ఉషశ్రీ
గాయత్రీదేవి



ఆ రోజుల్లో పండితుల కర్మాగారంగా ప్రసిద్ధి పొందిన పశ్చిమగోదావరి జిల్లా కాకరపర్రులో జన్మించిన శ్రీ ఉషశ్రీకి తల్లి (కాశీ అన్నపూర్ణ) తండ్రులే (పురాణపండ రామమూర్తి) ప్రథమ గురువులు.

కవీ, కథకుడూ, నాటకకర్తా అయిన ఉషశ్రీ ఆకాశవాణిలో (1965) ప్రవేశించి, సూటిగా లక్ష్యంవైపు దూసుకుపోయే బాణం లాంటి తన వాక్కుతో (1973 నుండి దశాబ్దం పైగా) ఎందరికో ధర్మసందేహాలు తీర్చారు. రామాయణ, మహాభారత కావ్యాలని మధించి, మధుర గంభీర గళంతో అశేష జనావళికి జ్ఞానసుధను పంచారు. ఉపన్యాసాన్ని ఒక కళగా రూపొందించి రామాయణ భారతోపన్యాసాలతో యావదాంధ్రదేశాన్నీ ఉర్రూతలూగించారు. నేటికీ ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారు సి.డిల రూపంలో ఆ జ్ఞానసుధని ఆస్వాదిస్తూనే ఉన్నారు.

మానవజాతి సర్వకాలాలలోనూ సుఖశాంతులతో మనుగడ సాగించడానికి అవసరమయిన విశేషాలు అందించే గ్రంథాలు అని ప్రతిపాదిస్తూ ఆయన రాసిన రామాయణ భారత భాగవతాల ప్రతులు లెక్కలేనన్ని లక్షల సంఖ్యలో పాఠకులకి చేరాయి. చేరుతూనే ఉన్నాయి. తన జీవితాన్ని (1928–1990) కావ్యత్రయ ప్రాచుర్యానికి అంకితం చేసిన ఉషశ్రీ కలం, గళం అమరం.



రెండున్నర దశాబ్దాలుగా ఎందరికో వైద్యసేవలూ, మాస, దిన పత్రికలూ, టి.వి. ఛానెల్స్, పుస్తకాల ద్వారా అందరికీ ఆరోగ్య సూచనలూ–

వైద్య విద్యార్థులకి పాఠ్యగ్రంథాలూ – అందిస్తున్న డాక్టర్ గాయత్రీదేవి ఉషశ్రీ పెద్దమ్మాయి.

వారసత్వంగా సంక్రమించిన 'రచనాసక్తితో – అప్పుడప్పుడూ కథలూ, రేడియో నాటికలూ, రూపకాలూ రాసే గాయత్రీదేవి, తండ్రి అసంపూర్ణ రచన 'రామాయణంలో హనుమంతుడి'ని పూర్తి చేశారు.

తన రచనలకి కొన్ని అవార్డులతో పాటు భరతముని ఆర్ట్స్ అకాడమీ వారి 'ఆదర్శవనిత' పురస్కారం అందుకున్నారు.

# ఎవరితో ఎలా మాట్లాడాలి?

(రామాయణంలో హనుమంతుడు)

**ఉషశ్రీ**

**గాయత్రీదేవి**

ఉషశ్రీ మిషన్

రేడియో కాలనీ, విజయవాడ - 520 008

**EVARITO ELA MATLADALI**
*(Ramayanamlo Hanumantudu)*
**Ushasri**

© Ushasri Mission

*Cover design :* Bapu

Ushasri Mission
Radio Artistes' Colony
Vijayawada 520008

*First edition :* 2008

*For copies:*
**Dr.GayatriDevi**
Mumbai
Ph: 022-22183149

**Ushasri Mission**
Vijayawada Ph: 9848113681
Hyderabad Ph: 9848598797

**Visalandra Book House** all Branches
**Navodaya Publishers** Vijayawada
**Navodaya Book House** Hyderabad

*Printed at*
**SriSri printers**
Vijayawada-2
Ph. (0866) 2433359
Cell : 94906 34849

Price : Rs. 40/-
$. 5

# ముందుమాట

మాట చేతకాక విరోధాలు తెచ్చుకొని ప్రాణాలు కోల్పోయే వారెందరో ఉన్నారు.

మాటతో లోకాన్ని జయించి, సమాజంలో సన్మానాలు పొందే వారూ ఉన్నారు.

మాట్లాడడం అనే విద్య నేర్చుకోవాలనుకున్న వారికి హనుమంతుడే గురువు. ఆ మహనీయుడు కార్యాచరణ దీక్షలో కూడా నేటి యువతీ యువకులకి ఆదర్శప్రాయుడు.

అని ఎంతో గాఢంగా నమ్మేవారు ఉషశ్రీ.

ఆ విషయాన్ని అందరికీ తెలియజేయాలన్న కోరికతోనే 'రామాయణంలో హనుమంతుడు' అనే పుస్తక రచనని ప్రారంభించారు.

అయితే అది అసంపూర్ణంగా మిగిలిపోయింది.

ఉషశ్రీ తన ఉపన్యాసాలలో తెలిపిన భావాలను అధ్యయనం చేసిన ఆయన పెద్దమ్మాయి (డా॥ గాయత్రీదేవి) ఈ అసంపూర్ణ రచనని ఆయన మాటలలోనే పూర్తి చేశారు.

రెండు ముద్రణలు పొందిన ఆపుస్తకం ఆధారంగా "ఎవరితో ఎలా మాట్లాడాలి?" రూపుదిద్దుకుంది, ఉషశ్రీ పెద్దమ్మాయి చేతిలోనే.

ఉషశ్రీ జీవితాశయాలని ప్రజలకి చేరువ చెయ్యాలన్న ఉద్దేశ్యంతో కార్యక్రమాలు మొదలు పెట్టిన 'ఉషశ్రీ మిషన్' మీ అభిప్రాయాలనూ, సలహా సహకారాలనూ కోరుకుంటోంది.

**– ఉషశ్రీ మిషన్**

# ఎవరితో ఎలా మాట్లాడాలి?

*(రామాయణంలో హనుమంతుడు)*

జంతువులకి లేనిదీ, మానవుడికి దైవం అనుగ్రహించినదీ వాక్కు. మనలోని ఆలోచనలనీ, భావాలనీ వ్యక్తం చేసుకోగల శక్తి వాక్కులో ఉన్నది. ఈ వాక్శక్తిని సద్వినియోగ పర్చుకోవడంలోనే మనిషి గొప్పతనం ఉన్నది. ఒక మాట మాట్లాడడానికి ముందు ఆలోచించి ఏ పదాలు అవసరం, ఏ పదాలు అనవసరం, ఏ మాటలు ఎదుటిమనిషికి మన మనసులోని భావాన్ని స్పష్టంగా తెలియజేస్తాయి, ఏ మాటలు అపార్థాలకి దారితీస్తాయి, ఏ పదాలు వాడడం వలన, భావం వ్యక్తం అవ్వడమే కాక మనోరంజకంగా ఉంటుంది అనే విషయాన్ని ఆలోచించి, మాట్లాడడం ఎలా అనే అంశాన్ని సాధన చేసినట్లయితే వారికి తిరుగులేదు అని నిరూపించాడు రామాయణంలో హనుమంతుడు.

రామాయణంలో హనుమంతుణ్ణి ఎరిగిన వారు చాలా తక్కువగా ఉంటారు. రామాయణం చదివిన వారిలో, వ్యాఖ్యాతలలో, భాష్యకారులలో అనేకుల దృష్టిలో హనుమంతుడు రామభక్తుడు.

రామనామం చెవిని పడగానే తలవంచి ఆనందబాష్పాలు విడిచే హనుమంతుని ఎరిగినవారు అసంఖ్యాకులు. వాల్మీకి రామాయణంలో ఉన్న రామదూత హనుమంతుడు, తలవంచి బాష్పాలు వదిలేవాడు కాడు.

రావణుని పది తలలూ వంచి కంటతడి పెట్టించగల ధీరుడు, ధీమంతుడు. అటువంటి హనుమంతుడు రామాయణంలో సాక్షాత్కరిస్తాడు.

కాని రామానుజస్వామివారి భక్తిమార్గం దేశంలో నల్లేరుపై బండిలా సాగిన తరువాయి, రామాయణం వైష్ణవ స్వాముల పారాయణ గ్రంథమూ, ప్రవచనగాథా అయిన తరువాత హనుమంతుని అవతారం మారిపోయింది. రామభక్తుల కంటే హనుమద్భక్తులే దేశంలో అధికమయ్యారు. ఆలయాలలో మాత్రమే కాదు, నాలుగురోడ్ల కూడలిలో సైతం హనుమంతుని విగ్రహాలు లక్షల సంఖ్యలో వెలిశాయి. ఆయనకు అర్చనలు, ఆకుపూజలు, అష్టోత్తరాలు, సహస్రనామాలు సాగాయి, సాగుతున్నాయి.

ఇవన్నీ సాగడానికి ముందున్న హనుమంతుని ధీ, ధీర మూర్తిని రామాయణంలో దర్శించబోతున్నాం.

ఎప్పుడు, ఎక్కడ ఎవరితో ఎంత మాట్లాడాలో తెలిసిన వాడు హనుమంతుడు. ఈ దృష్టితో హనుమంతుని వెంట సావధాన చిత్తంతో నడవాలి.

ఆ విశ్వరూప సందర్శనానికి మీ మనోనేత్రాన్ని తెరవండి. భక్తితో చేతులు జోడించి, కన్నులు మూసుకోకుండా, ఆసక్తితో అధ్యయనం చెయ్యడానికి సన్నద్ధులుకండి.

కొద్ది క్షణాలు ఆ మేరునగధీరుని వెంట, శబ్ద బ్రహ్మవేత్త పదాలలో ధ్యానముంచండి. ఆ తరువాయి ముక్కుపుటాలకు త్రాళ్ళుపోసి లాగుతాడు. మీ ధీశక్తిని వికసింపజేసి మానవత్వాన్ని ప్రవృద్ధం చేస్తాడు.

* * *

శ్రీ మద్రామాయణంలో కథానాయకుడైన రాముని సరసన నిలబడేవాడు హనుమంతుడొక్కడే. బాల, అయోధ్య, అరణ్య కాండలలో కథ అంతా రాముని చుట్టూ నడుస్తుంది, దశరథ మరణ సన్నివేశం తప్ప.

కిష్కింధలో అడుగుపెడతాం, హనుమంతుడు ప్రవేశిస్తాడు, అది మొదలు పట్టాభిషేక పర్యంతం కథ హనుమంతుని వెంట నడుస్తుంది. శ్రీరాముడు ప్రభువు, హనుమంతుడు సేవకుడు. ఆయన సంసారి, ఈయన బ్రహ్మచారి. సింహాసనాన్ని తృణప్రాయంగా విడిచి వచ్చిన రాకుమారుడాయన.

అన్నగారి ఆగ్రహానికి ఆగలేక కొండలలో తలదాచుకున్న సుగ్రీవుని వెంట వచ్చిన సచివుడీయన. అనంతరం దూత.

సూక్ష్మంగా యిదీ రామ హనుమంతుల రూపం, రామాయణంలో...

* * *

శ్రీ మద్రామాయణ ప్రారంభ శ్లోకంలోనే వాక్కును ప్రస్తావించాడు మహర్షి వాల్మీకి.

తపస్స్వాధ్యాయ నిరతం
తపస్వీ వాగ్విదాం వరం
నారదం పరిపప్రచ్ఛ
వాల్మీకి ర్మునిపుంగవం ॥

మునిశ్రేష్ఠుడైన వాల్మీకి తపస్స్వాధ్యాయ నిరతుడూ, వాగ్విదాం పరుడూ అయిన నారదుని అడిగాడు.

అడిగినవాడు ముని, అడిగినది తపస్వీ. వేదాధ్యయన నిరతుడూ అయిన నారుదుని.

ముని అంటే మౌనవ్రత పరాయణుడు.

వేదాధ్యయన పరుడైన వానికి శబ్దం స్వాధీనంలో ఉంటుంది. పైగా ఆయన తపస్వి – అనగా ఏకాగ్రచిత్తుడు.

అదీ రామాయణ ప్రారంభం. ఇందులో 'వాగ్విదాంవర' శబ్దాన్ని ప్రధానంగా మనసులో ఉంచుకుని రామాయణం చదువుతూ కిష్కింధలో అడుగు పెడతాం. అక్కడ వాక్యకోవిద విశేషంతో హనుమంతుడు సాక్షాత్కరిస్తాడు.

వాగ్విదాంవరుడు నారదుడు.

వాక్యకోవిదుడు హనుమంతుడు.

వాక్కు అంటే శబ్ద బ్రహ్మం, ఆ బ్రహ్మతత్వం తెలిసిన వారిలో శ్రేష్ఠుడు నారదుడు.

అటువంటి శబ్ద బ్రహ్మ విద్యలో కోవిదుడు హనుమంతుడు.

ఈ ప్రస్తావన ఇంత దేనికీ అంటే మానవునికి మాటమీద ఎంత

ప్రతిపత్తి ఉండాలో, దానిని ఎంత జాగ్రత్తగా వినియోగించుకోవాలో బోధించడానికే మనం రామాయణం చదవాలి, వినిపించాలి అని ఆదికవి మహర్షి వాల్మీకి మనోహరంగా అందించాడు.

❊ ❊ ❊

మాట్లాడటం అంత బ్రహ్మ విద్యయా అనిపిస్తుంది, నోటి కొచ్చింది కూసేవారికి; కాని రామాయణంలో రాముని నోట హనుమంతుని గూర్చిన ప్రశంస విన్నప్పుడు మాట్లాడటం ఎంత విశిష్టంగా ఉండాలో తెలుసుకో గలుగుతాం.

మాట మీదనే యింత పట్టుదల దేనికీ అంటే –

సృష్టిలో – పేడలో పెరిగే పురుగు మొదలు మేడలో తిరిగే పురుషుల వరకూ ఆహారం, నిద్ర, భయం సంతానోత్పత్తి అన్నీ సమాన ధర్మాలే.

ఈ చరాచర జీవకోటిలో మానవుని ప్రత్యేకత ఏమిటి? "జంతూనాం నరజన్మ దుర్లభం" అని ఎందుకంటారు?

ఎందుకంటే న్యాయం – అన్యాయం, ధర్మాధర్మాలు, ఉచితానుచితాలు అన్నీ మానవునికే ఉన్నాయి. వాటిని నిర్ణయించే బుద్ధిగల ప్రాణి మానవుడు, దానిని ఎలా వినియోగించుకోవాలో తెలుసుకోనినాడు అది అవివేకి చేతిలో మారణాయుధమే అవుతుంది. మాట చేతకాక విరోధాలు తెచ్చుకొని, ప్రాణాలు కోల్పోయే వారెందరో వున్నారు.

మాటతో లోకాన్ని జయించి సమాజంలో సన్మానాలు పొందేవారూ ఉన్నారు. అందుకే కాలుజారితే తీసుకోగలం కాని నోరుజారితే తీసుకోలేం అంటారు విజ్ఞులు.

అందుకే రామాయణంలో హనుమంతుని వెంట అనుదినం ఒక గంట తిరుగుతూంటే మన ధీశక్తి వికసించి దానిని ఎదుటివారికి తెలిపే సంభాషణా చాతుర్యం లభిస్తుంది. కిష్కింధతో హనుమత్ప్రవేశం నుండి యుద్ధకాండ చివర రామపట్టాభిషేక పర్యంతం ఈ ధీమంతుని వెంట సావధానచిత్తులై నడవండి, కొంతలో కొంతయినా మాట్లాడే శక్తి అలవడుతుంది.

ప్రభువు హితవుకోరే సచివుడిగా సుగ్రీవునితో, తన ప్రభువుతో స్నేహం చేసేలా రామలక్ష్మణులతో, అపరిచిత ప్రాంతంలో కలిసిన స్వయంప్రభతో, సీతాన్వేషణ కార్యభారాన్ని స్వీకరిస్తూ వానరసేనతో, లంకానగర ప్రవేశాన్ని నిరోధించిన లంఖిణితో, ఆత్మహత్యకి సిద్ధమవుతున్న సీతాదేవితో, తనని ఎదిరించ వచ్చిన రాక్షసులతో, అశోకవన విధ్వంసానికి ఆగ్రహించిన రావణునితో, సీతక్షేమ సమాచారాన్ని అందిస్తూ – వానరులతోనూ, శ్రీరామునితోనూ... అడుగడుగునా హనుమ మాటతీరు మానవులందరికీ అనుసరణీయం.

కిష్కింధకాండలో –

వాక్యకోవిదుడైన హనుమంతుడు మాట్లాడుతున్నాడు – అని 'వాక్య కోవిదుడు' అనే విశేషణంతో హనుమంతుని పాత్రని ప్రవేశపెట్టాడు మహర్షి వాల్మీకి. వాక్యకోవిదుడు అంటే మాట్లాడటం తెలిసిన విద్వాంసుడు అని అర్థం.

సన్నివేశంలోకి వెడదాం.

అన్నగారైన వాలి తరుమగా ఋశ్యమూక పర్వతం మీద తలదాచుకున్న సుగ్రీవుడు రామలక్ష్మణులను అల్లంత దూరాన చూస్తూనే భయకంపితుడై పరుగు పరుగున పోతూ తన మంత్రుల మధ్య బెదురుతూ నిలబడ్డాడు. అప్పుడు హనుమంతుడు –

సంభ్రమస్త్య జ్యతామేష
సర్వై ర్వాలికృతే మహాన్
మలయోయం గిరివరో
భయం నేహాస్తి వాలినః

* * *

ఉవాచ హనుమాన్వాక్యం
సుగ్రీవం వాక్యకోవిదః

* * *

సంభ్రమాన్ని విడిచిపెట్టు –

మనం ఉన్న ఈ మలయ పర్వతం మీద వాలి భయం యీషణ్మాత్రం లేదు. వాలి ఈ పర్వత పరిసరాలలోకి రాలేడు, మనస్సు భయంతో నిండి ఉండడం వల్ల అన్నీ అనుమానాలే కలుగుతున్నాయి.

అనాలోచితంగా ఏ పనీ చెయ్యరాదు. విజ్ఞానంతో బుద్ధిని నడిపించాలి, అన్నాడు.

సుగ్రీవస్తు శుభం వాక్యం
శ్రుత్వా సర్వం హనూమతః॥

హనుమంతుని నోట వెలువడిన శుభప్రదమైన వాక్యాలు విన్నాడు సుగ్రీవుడు.

వాక్య కోవిదుడైన హనుమంతుని నోట మంచి మాటలు వినిపించాయి. దీనినిబట్టి మాటమీద – శబ్దం మీద మహర్షి వాల్మీకికి ఎంత ప్రత్యయం వున్నదో అర్థమవుతుంది.

## రామలక్ష్మణులతో

సుగ్రీవుని కోరిక మేరకు, రామలక్ష్మణుల మనసు తెలుసుకోవడానికి, భిక్షు రూపంలో వారిని సమీపించి, భక్తి భరిత హృదయంతో –

రాజర్షి దేవ ప్రతిమౌ
తాపసౌ శంసిత వ్రతౌ

రాజర్షులవలె, దేవతామూర్తుల వలె, తపస్వులవలె, తీవ్రవ్రత పరాయణుల వలెనున్న సుందర మానవులు ఈ ప్రాంతాని కెందుకు వచ్చారు:

పంపానదీతీర వృక్షశోభకూ, నదీతరంగాలకూ పులకించే మిమ్ముచూస్తూ ఈ అరణ్యంలో జంతువులన్నీ భయంతో పరుగులు పెడుతున్నాయి.

స్వచ్ఛ సువర్ణకాంతులీనే శరీరాలతో, సింహసదృశ పరాక్రమంతో ఏనుగు తొండాలవంటి భుజాలతో, వృషభగమనంతో, ఇంద్రధనుస్సుతో

సమానమైన ధనుస్సులు ధరించి, భూమికి దిగివచ్చిన సూర్యచంద్రులవలె వెలుగుతున్నారు. రత్నమాణిక్య భూషణాలు ధరించవలసినవారు, ఏ భూషణం లేకుండా నారచీరలతో ఎందుకున్నారు.

బంగారుకాంతులీనే ఖడ్గాలు బుసలుకొడుతున్న కోడెత్రాచుల్లా వున్నాయి.

నదీనద పర్వతకానన సమేతం భూమండలాన్ని రక్షించడానికి సమర్థులు, ఎందుకిలా వేడి నిట్టూర్పులు విడుస్తూ తిరుగుతున్నారు - అన్నాడు.

రాజర్షి, తపస్వి శబ్దాలతో ఆరంభించడంలోనే ఆయన వాక్యకోవిదత్వం కనిపిస్తుంది. మిగిలిన ప్రసంగం అంతా వారి పరాక్రమ వర్ణనయే. అంతసేపు ఆయన మాట్లాడినా అన్నదమ్ములు పెదవి విప్పలేదు.

అప్పటికర్థమై - 'ఆర్యా, నే నెవరినో చెప్పలేదు. వానర - యూథపతి; ధర్మాత్ముడు, సుగ్రీవుడు. సోదరుని ఆగ్రహానికి గురై దిక్కులుపట్టి తిరుగుతున్నాడు. మీతో సఖ్యం కోస ఆయన పంపగా వచ్చాను. నన్ను హనుమంతుడంటారు. నేను కామరూపిని కనక మీరెవరో తెలుసుకుందామని యిలా భిక్షురూపంతో' అని మౌనం వహించాడు.

వస్తూనే హనుమంతుడు వారిని ప్రస్తుతిస్తూ ప్రసంగించినా తాను ఎవరివాడో, ఎందుకు వచ్చాడో చెప్పలేదు. అందుకే రామలక్ష్మణులు మాట్లాడలేదు.

అంటే మనకు తెలియని వారి దగ్గరకు వెళ్ళినపుడు మన పరిచయం మనం చేసుకోకుండా ప్రసంగానికి దిగరాదు అనే ప్రాథమిక సూత్రం ఇక్కడ బోధించాడు.

అందులోనూ ప్రారంభం ఎలా చేశాడు -

'సుగ్రీవో నామ ధర్మాత్మా' - ధర్మాత్ముడైన సుగ్రీవుడు, అంటూనే 'వీరో వినికృతో భ్రాత్రా' అన్నగారిచేత పరాభూతుడు, ఆయన పంపగా వచ్చాను. ఎంత గాధను యీ మూడు వాక్యాలలో నిక్షేపించాడో చూడండి.

తస్యమాం సచివం – ఆయన మంత్రిని, ఆయన మీ స్నేహంకోరి పంపాడు.

అదీ మాట్లాడే పద్ధతి.

ఇక్కడొక రహస్యం ఉన్నది.

సుగ్రీవుడు స్నేహం విషయం ప్రస్తావించలేదు. అయినా హనుమంతుడు ముందడుగు వేశాడిక్కడ.

అంతసేపు మాట్లాడుతూ వారి ముఖకవళికలు పరిశీలించి ఇంగితం గ్రహించాడు. వారు కూడా ఏదో ఆపదలో ఇలా వచ్చారని అర్ధమైంది. అస్త్రశస్త్రవేత్తలని తెలిసింది. అటువంటి వారి స్నేహం తన ప్రభువుకి అవసరం అనుకున్నాడు.

సమయోచితంగా తీసుకోవలసిన నిర్ణయం తీసుకోగలిగినవాడే ఉత్తమ సచివుడు, చక్కని దూత. అదీ హనుమంతుని విశిష్ట లక్షణం.

ఒక్కసారి విశ్వనాథవారు హనుమంతుని వివేకాన్ని ఎలా ప్రదర్శించారో చూద్దాం.

హనుమ తా మాటలాడుచున్నంత సేపు
నన్నదమ్ముల కన్నులయందు గనుచు
రాము కన్నుల పరమేశ్వరత్వ (ము)
అనుజు కన్నులన్ యోగిరాజు
లక్షణము గంచు –

మాట్లాడుతున్నంతసేపూ అన్నదమ్ముల కన్నులు పరిశీలించే హనుమంతునికి రాముడు పరమేశ్వరుడుగా, లక్ష్మణుడు యోగీశ్వరుడుగా కనిపించారు.

ఈ పరమేశ్వరత్వం, యోగీశ్వరత్వం రామాయణం బహుళ ప్రచారం పొంది, ప్రక్షిప్తాలెన్నో ఇరికి, రామానుజుల భక్తి ప్రబలిన తరువాయి లోకంలో ప్రవేశించినవి.

ప్రధానాంశం –మనం ఎవరితో మాట్లాడుతున్నామో వారి కన్నులలో

కన్నులుంచి పరిశీలించాలి. మన అభిప్రాయాలకు వారి ప్రతి స్పందన ఎలా ఉన్నదీ కన్నులలో కనిపిస్తుంది. అది గ్రహించి ముందుకు సాగాలి. ఆ వివేకం హనుమంతుని కున్నదని విశ్వనాథుల భాష్యం.

హనుమంతుడు సుగ్రీవుని మంత్రిగా వచ్చి మాట్లాడగానే శ్రీరామచంద్రుడు సంతోషభరితవదనుడై :

నా నృగ్వేద వినీతస్య
నా యజుర్వేద ధారిణః
నా సామవేద విదుషః
శక్యమేవం విభాషితుం ॥

ఋగ్వేద వినీతుడు, యజుర్వేదధారి, సామవేదవిదుడు అయినవాడు తప్ప, ఇలా మాట్లాడలేడు – అన్నాడు.

హనుమంతుని మాటలు వినగానే రాముని నోట వెలువడిన మాట అది. మూడు వేదాలూ అధ్యయనం చేసినవాడు – అని ఒక్కమాటలో చెప్పకుండా వినీత, ధారణ విదుష శబ్దాలు ప్రయోగించడంలో విశేషం ఉన్నది.

ఋగ్వేద, యజుర్వేద, సామవేదాలు ఒకే పద్ధతిని అధ్యయనం చెయ్యరు. ఒక్కొక్కటి ఒక్కొక్క రీతిలో ఉంటుంది.

ప్రతివర్ణం స్వరభూయస్త్వేన
మనోనియమనేన సావధానోచ్చార్యత్వాత్
ఋగ్వేద వినీతస్య –
ఏకైకానువాకే అనువాకాంతర
వాక్య సాంకర్యేణ ధారణస్య
దుష్కరత్వాత్ యజుర్వేద ధారిణ –
ఊహా రహస్యాది గర్భితగాన విశేషాణాం
దుర్విజ్ఞేయత్వాత్ సామవేద విదుష –

ఋగ్వేద మంత్రాలలో ప్రతి అక్షరానికి విశిష్టమైన అర్థం తెలిపే స్వరం ఉంటుంది.

మనస్సును అదుపులో ఉంచి, చక్కని శిక్షణతో గురువు దగ్గర అధ్యయనం చేసేవానిని వినీతుడంటారు. ఋగ్వేదానికి ఇది ప్రధానం కనుక వినీతుడు.

యజుర్వేదంలో ఒక దానిలోని వాక్యాలు మరో దానిలో వస్తాయి. ధారణ సరిగా లేకపోతే సాంకర్య దోషం పడుతుంది కనుక యజుర్వేదానికి ధారణ ప్రధానం.

సామవేదం గాన ప్రధానం. గానం చేసేటప్పుడు ఎక్కడికక్కడ మార్పులు చేసుకుంటూ సాగే ఊహాశక్తి కావాలి. ప్రతిభతో ఊహించి రూపొందించుకోవాలంటే వైదుష్యం ఉండి తీరాలి. ఈ వైదుష్యం లేకపోతే సామవేదగానం పట్టుపడదు. కనక సామవేద విదుషః – అని ప్రయోగించాడు, వేదవేత్తయైన ఆదికవి – ఇంత సంప్రదాయం తెలియాలి కావ్యరచనకు.

నూనం వ్యాకరణం కృత్స్నం
అనేన బహుధాశ్రుతం
బహు వ్యాహరతానేన
నకించి దపశబ్దితం,

ఈయన మాట్లాడిన మాటల్లో ఒక్క అపశబ్ధం లేదు. అంటే వ్యాకరణం సంపూర్ణంగా అధ్యయనం చేశాడని తెలుస్తున్నది.

ప్రకృతి ప్రత్యయ సమాస సంఖ్యాదిషుకించిదపి నా ప్రభుశితం ।

ప్రకృతి, ప్రత్యయం, సమాసం, సంధి యిన్నిటిలో దోషం లేకపోతే అది సలక్షణం అని వ్యాఖ్యానించారు.

సముఖే నేత్ర యోర్వాపి
లలాటే చభ్రువో స్తథా
అన్యేష్వపిచ గాత్రేషు
దోషః సంవిదితః క్వచిత్ ॥

ముఖం, కన్నులు, నుదురు, కనుబొమలు ఆదిగాగల అవయవాలలో వికారాలేమీ కనిపించలేదు.

ఈ వికారాలను గురించి వేదాంగమైన శిక్షాశాస్త్రం -

గీతీ దీర్ఘశిరః కంపీ
తథా లిఖిత పాఠకః
అనర్థజ్ఞోల్ప కంఠశ్చ
షడేతే పాఠకాధమాః॥

సంగీతంలా ఉండరాదు, సాగతీతలు పనికిరావు, తల విసుర్లుండరాదు, వ్రాసిన కాగితాలు (తాళపత్రాలు) చూస్తూ చదవరాదు. అర్థం మారిపోయే రీతిలో ఉండరాదు; కీచుకంఠం పనికిరాదు. వేద పాఠకులకు ఈ ఆరూ దోషాలని శాస్త్ర ఘోష.

వేదత్రయాన్ని అధ్యయనం చేసినవాడు కనకనే హనుమంతుడు శిక్షాశాస్త్రానుసారం మాట్లాడాడని రాముని భావం.

అవిస్తరం అసందిగ్ధం
అవిలంబితం అద్రుతం
ఉరస్థం కంఠగం వాక్యం
వర్తతే మధ్యమే స్వరే ॥

సంస్కార క్రమ సంపన్నాం
అద్రుతాం అవిలంబితాం
ఉచ్చారయతి కళ్యాణీం
వాచం హృదయ హారిణీం ॥

విషయంతో సంబంధంలేని మాటకాదు, సందిగ్ధంగాలేదు. ఆపి ఆపి మాట్లాడలేదు. హృదయంలోంచి, కంఠంలోంచి వచ్చి మధ్యమ స్వరంలో సంస్కార సంపన్నమై కళ్యాణగుణయుతమై వినేవారి హృదయాన్ని అలరిస్తూ మాట్లాడాడు.

అనయా చిత్రయా వాచా
త్రిస్థాన వ్యంజనస్థయా

కస్య నారాధ్యతే చిత్తం
ఉద్యతాసే రరేరపి ॥

ఏవం విధో యస్యదూతో
నభవేత్ పార్థివస్యతు
సిద్ధ్యంతిహి కథం తస్య
కార్యాణాం గతయోనఘ ॥

ఏవం గుణగణైర్యుక్తా
యస్యస్యుః కార్యసాధకాః
తస్య సిద్ధ్యంతి సర్వార్థా
దూత వాక్య ప్రచోదితాః ॥

ఏ అక్షరం ఏ స్థానం నుంచి పలకాలో అక్కడినుంచే పలికాడు. కత్తిదూసి మీదికి వచ్చే శత్రువైనా ఈ మాటలువింటే చేతులు జోడించి తలవంచాలి.

ఇటువంటి దూతను సంపాదించిన రాజు సాధించలేనిది లేదు.

ఈదృశ శక్తిమంతుడైన దూతమాటలు వినే రాజు సర్వాభీష్టాలూ సిద్ధిస్తాయి అని ఆగలేదు, వాక్యజ్ఞుడైన హనుమంతునితో లక్ష్మణుడు మాట్లాడుతున్నాడు అని ముగించాడు.

అక్షరాలు పలకడానికి మన శిరస్సులో మూడు స్థానాలున్నాయి. ఉదాత్తస్వరం శిరసునుంచి, అనుదాత్తం హృదయం నుంచి, స్వరితం కంఠ మూలంనుంచి రావాలని శిక్షాశాస్త్ర శాసనం. ఇది వేదానికి సంబంధించినదే అయినా మనం మాట్లాడే మాటల్లో అన్నీ ఒకే రకంగా ఉండవు. మాటకు కూడా లయ ఉంటుంది.

వేద పాఠకుడికి ఆరు అవలక్షణాలున్నట్లే ఆరు గుణాలున్నాయని శిక్షాశాస్త్రం.

మాధుర్యం అక్షరవ్యక్తి పదచ్ఛేదం త్వరా ధైర్యం లయసమత్వం.

మధురంగా ఉండాలి, అక్షరం స్పష్టంగా వినిపించాలి, పదాలు విస్పష్టంగా ఆగాలి, ఒక దానివెంట ఒకటి దూసుకురావాలి. గంభీరంగా ఉండాలి, లయాన్వితంగా సాగాలి.

ఈ దృష్టితో చూసినప్పుడు హనుమంతుడు వాక్యజ్ఞుడు, వాక్య విశారదుడు, వాక్యకోవిదుడు ఎందకయాడో తెలుస్తుంది. తెలిసినప్పుడు మాట్లాడడమనే విద్య ఎంత విశిష్టమో, దానిని అభ్యసించడానికి మనం హనుమంతుని గురువుగా స్వీకరించడం మరెంత అవసరమో గ్రహించ గలుగుతాం.

రామాయణంలో ఏనాడూ ఎవరినీ ప్రశంసించని శ్రీరామచంద్రుడు మొదటి కలయికలో నాలుగు మాటలు మాట్లాడిన హనుమంతుని యింతగా ప్రశంసించడం చూస్తే మాటమీద ఆయనకెంత గౌరవం ఉన్నదో, ఆది కావ్యాన్ని అందించిన వాల్మీకికి ఎంత సదభిప్రాయం వున్నదో తెలుసుకోగలుగుతాం.

తెలుసుకొని హనుమంతుని సంభాషణా విధానాన్ని కొంతయినా నేర్చుకోవడానికి ప్రయత్నిద్దాం. అదే రామాయణ పఠనంతో మనం గ్రహించి ఆచరణలో పెట్టవలసిందీ, ముందు తరాలకు నేర్పవలసినదీనీ.

అంతేకాని రామభజన చెయ్యడానికి రామాయణం, కృష్ణ భజనకు భారతం చదవనూ అవసరం లేదు. పారాయణమూ ప్రయోజనం లేదు.

### సుగ్రీవునితో

అయం రామో మహాప్రాజ్ఞః
సంప్రాప్తో దృఢ విక్రమః
లక్ష్మణేన సహభ్రాత్రా
రామోయం సత్యవిక్రమః॥

ఇక్ష్వాకూణాం కులేజాతో
రామో దశరథాత్మజః

ధర్మే నిగది తశ్చైవ
పితుర్నిర్దేశ పారగః॥

రామలక్ష్మణులిద్దరినీ సుగ్రీవుని దగ్గరకు తీసుకువచ్చి :

ఈయన రాముడు, మహాప్రాజ్ఞుడు, దృఢవిక్రముడు, సోదరుడైన లక్ష్మణునితో వచ్చిన యీ రాముడు సత్యవిక్రముడు, అని ఆరంభించాడు.

ఇంతకు ముందు తనను గురించి చెపుతూ "సుగ్రీవో నామ ధర్మాత్మా" ధర్మాత్ముడైన సుగ్రీవుడు అన్నగారిచేత వంచితుడయాడు, అన్నాడు.

మహాప్రాజ్ఞుడైన రాముడు సోదరునితో వచ్చాడని ఆరంభించి సోదర ప్రేమ విశేషం వ్యక్తం చేసి, ఇక్ష్వాకు వంశంలో దశరథుని కుమారుడుగా పుట్టి, ధర్మపరాయణుడై, పితృవాక్య పాలనకు అడవులవెంట వచ్చాడు అన్నాడు.

రాముని ధర్మనిష్ఠతో ఆ వంశీయులందరూ అంతటివారే అనడానికి ఇక్ష్వాకు వంశం అన్నారు.

ఈయన తండ్రి దశరథుడు భూరిదక్షిణలతో రాజసూయ, అశ్వమేధ యాగాలు చేసి అగ్నిహోత్రుని ఆరాధించిన మహనీయుడు. ఆడినమాట తప్పకుండా రాజ్యాన్ని పాలించినవాడు, తపస్వి.

ఆయన కుమారుడైన ఈ రాముడు నీ సహాయం కోరి వచ్చాడు. వీరితో స్నేహం నీకు మంచిది, ఉచితరీతిని సత్కరించు అన్నాడు.

ఇక్కడ దృఢవిక్రముడు, సత్యవిక్రముడు అని రెండు విశేషణాలు ప్రయోగించాడు. సుగ్రీవునికి కావలసిది విక్రమవంతుని స్నేహం. అదిన్నీ దృఢంగా సత్యమైనదై ఉండాలి. అందుకే ముందు అది చెప్పి తరువాయి ధర్మ విషయం ప్రస్తావించాడు.

అంతతో ఆగాడా! భార్యా వియోగ బాధలో ఉన్నాడు అని సుగ్రీవునికి ఆయనతో సఖ్యానికి ఉచితమైన కారణం ప్రస్తావించాడు.

సమాన శీల వ్యసనేషు సఖ్యం –

శీల వ్యసనాలు సమంగా ఉంటేనే స్నేహం, ఇక్కడ వ్యసనం అంటే దుఃఖం అని గ్రహించాలి.

ఇంత వివేకవంతుడు కనుకనే హనుమంతుడు రాముని సరసన నిలబడగలిగాడు రామకథలో.

మరో విశేషం – రామాయణంలో రాముడు మాట్లాడడం చాలా తక్కువ. మాట్లాడడం ఆరంభించాడో కార్యరంగంలో దిగుతున్నాడన్నమాటే. అది ప్రభు లక్షణం.

హనుమంతుడు ఎక్కడ ఎంత మాట్లాడాలో మాట్లాడి, కార్యరంగంలో దిగుతాడు. అది సేవక లక్షణం.

తరువాయి వాలికథ, సుగ్రీవ పట్టాభిషేకం, ఇంతలో వర్షాకాలం – ఇంత కథ నడుస్తుంది. పట్టాభిషిక్తుడైన సుగ్రీవుడు భార్య రుమతో, తారతో హాయిగా మదిరాపానంతో, కామభోగాలలో మునిగి ప్రపంచాన్నే మరిచిన సమయంలో ప్రవేశిస్తాడు హనుమంతుడు.

రాజ్యం ప్రాప్తం యశశ్చైవ
కాలే శ్రీరభివర్ధితా
మిత్రాణాం సంగ్రహశ్శేషః
తం భవాన్ కర్తు మర్హతి ॥

రాజ్యం లభించింది. దానితో కీర్తి వచ్చింది, కులానుగతమైన సంపద పెరుగుతున్నది. ఇక మిగిలిందేమిటి !

మిత్రకార్యం. అది నిర్వర్తించడం అవశ్య కర్తవ్యం –

మాట ఎలా మొదలుపెట్టాడో చూశారా !

రాజ్యం లభించింది, అనగానే నీకింత భోగాన్ని లభింపజేసిన మిత్రునికి ఏ ప్రత్యుపకారం చేశావు, అగ్నిసాక్షిగా స్నేహబంధం ఏర్పరచుకున్నప్పుడు చేసిన వాగ్దానం నెరవేర్చి రాముడు నీకు సింహాసనం సమకూర్చాడు. నీ కర్తవ్యాన్ని విస్మరించి సుఖడోలల్లో గడుపుతున్నావు; ఇంత భావం ఉన్నది – రాజ్యం ప్రాప్తం – అనే మాట వెనుక.

సుగ్రీవుని కసలు సింహాసన యోగం లేదు, వాలి అనంతరం అంగదుడు రాజవుతాడు; రాజుగారి తమ్ముడికి మనోవర్తి వస్తుంది తప్ప రాజ్యం

లభించదు. అటువంటి దశలో – రాజ్యం సమకూర్చి పెట్టాడు రామచంద్రుడు. అంత చేసిన వాని విషయం విస్మరించి, ఒళ్లు తెలియకుండా త్రాగి, నారీలోలుడై పడి ఉన్న సుగ్రీవునితో – "రాముడు భార్యావియోగ దుఃఖంలో వున్న విషయం కూడా నీకు గుర్తులో లేదు. ఇదంతా శక్తి శాలివి, శూరుడవు, వానర భల్లూక గణాధిపతివి అయిన నీ వల్ల జరిగిందంటావా? ఆయనంటావా? సురాసురులను నిలబెట్టి తలవంచగలవాడు. తన ప్రాణాలు లెక్కచెయ్యకుండా వాలిని సంహరించాడు నీకోసం. ఎంతటివారినైనా అనాయాసంగా యమపదం చేర్చగలవాడాయన. నీ సాయం అక్కరలేకుండానే ఆయన పని పూర్తి చేసుకోగలడు. కాని మనకు చేసిన ఉపకారానికి ప్రత్యుపకారం చేయడం మన విధి.

భూమ్యాకాశాలలో ఎక్కడ ఉన్నా సీతను అన్వేషించాలి, అలా తిరిగి రాగలవారు వానరయోధులు. నీ నోట ఆజ్ఞ రావడం చాలు వారు కార్యం సాధించుకు వస్తారు" అన్నాడు.

హనుమంతుడు తన ప్రభువుతో మాట్లాడుతున్నాడు. ప్రభువు హితవుకోరి కాలోచిత కర్తవ్య ప్రబోధం ఎలా చెయ్యాలో రామాయణం చదివే వారందరికీ బోధించాడు.

మనం వ్యాఖ్యానించుకోవలసింది – 'రాజ్యం–ప్రాప్తం' అనే రెండు మాటల వెనుక హనుమంతుని మనస్సులో ఎంత ఊహ ఉన్నదో తెలియడానికి.

అంతతో ఆగాడా!

"కీర్తి పొందావు, కులానుగతమైన సంపదలు పెరుగుతున్నాయి" అన్నాడు.

ఒక రకంగా చూస్తే ఇవన్నీ సుగ్రీవునికి దక్కవలసింది కాదు, ఇవన్నీ రాముని కారణంగా లభించాయి. అందుకే ఆ వాక్యాన్ని అనుసరిస్తూ–

"మిత్రాణాం సంగ్రహశ్శేషః –

స్నేహితుని కార్యం నిర్వర్తించడం మిగిలింది."

జరిగిన ఉపకారం చెప్పి, అంత ఉపకారం చేసిన మిత్రుని కార్యం

విస్మరించరాదని మృదువుగా హెచ్చరించడంలో ఉంది ఆయన వివేకం.

"కాలం అతిక్రమించకుండా మిత్రుల కార్యం నిర్వర్తించే వాని రాజ్యం, కీర్తి, ప్రతాపం వృద్ధిపొందుతాయి.

కోశాగారం, సైన్యం, మిత్రులు యీ మూడింటినీ సమంగా చూసుకునే రాజు అభ్యుదయం పొందుతాడు. సదాచార సంపన్నుడవైన నీవు మిత్రకార్య నిర్వహణ సాగించాలి.

ఎటువంటి పనులున్నా విడిచి స్నేహితుని కోసం నడుంకట్టే వానికి ఏ అనర్థాలూ ఉండవు, ఈ విషయంలో కాలాతిక్రమణం కారాదు, అలా జరిగితే అది చాలా ప్రమాద హేతువు.

సీతాన్వేషణ మిత్రకార్యం, అప్పుడే కాలాతిక్రమణం అయ్యింది, ఆయన ఈ మాట తన నోటితో చెప్పడు, ఆయన అభిజాత్యం అంతటిది.

ఆయన మనకి మేలు చేశాడు, అందుకు మనం ఋణం తీర్చుకోవాలి.

నీకు ఉపకారం చేయని వాడికి కూడా మేలుచేసే స్వభావం నీది, కాలం అతిక్రమించినా, కన్ను తెరిచి వానరులకు ఆజ్ఞాపించు."

అందుకే రాముడన్నాడు –

ఇటువంటి సచివుడున్న ప్రభువు సాధించలేనిది లేదని.

యజమాని శ్రేయస్సు కోరేవాడు ఎంత కాలజ్ఞానంతో వ్యవహరించాలో, తన ప్రభువు అప్రమత్తుడై ఉంటే ఆయనకు కర్తవ్యం ఎలా ప్రబోధించాలో కనిపిస్తుందిక్కడ.

❊ ❊ ❊

అనుకున్నంతా అయింది.

వానలు వెనకబడి, మేఘాలు తెల్లని దూదిపింజలవలె ఆకాశంలో తిరుగుతున్నా, నదీప్రవాహాలలో దూకుడు తగ్గి, బురద విరిగి, అక్కడక్కడ ఇసుక తిన్నెలు ఏర్పడినా, నెమళ్ళు నాట్యాలు మానినా సుగ్రీవునికి కామభోగం నుండి బైటపడాలనే తలంపు రాలేదు.

కాలజ్ఞుడైన శ్రీరామచంద్రుడు తన తమ్ముని పిలిచి –

సుగ్రీవుని విషయం తేల్చుకు రమ్మన్నాడు. అన్నగారి బాధ తెలిసిన లక్ష్మణుడు కన్నుల నిప్పులు చెరుగుతూ కిష్కింధచేరి అంతఃపుర ద్వారంలో నిలిచి ధనుష్టంకారం చేశాడు. అప్పటికి తెలివి వచ్చిన సుగ్రీవుని ఎదుట నిలిచి, హనుమంతుడు :

సర్వథా నైతదాశ్చర్యం
యస్త్వం హరిగణేశ్వరః॥
నవిస్మరసి సుస్నిగ్ధం
ఉపకార కృతం శుభం ॥

"వానరేశ్వరా, ఉపకారం చేసిన స్నేహితుని మరచిపోక పోవడంలో ఆశ్చర్యమేమున్నది, ఆయన ప్రాణభీతిని విడిచి నీకోసం వాలిని సంహరించాడు. ఇప్పుడైనా ఆయన లక్ష్మణుని పంపించాడూ అంటే అంత కోపంలోనూ స్నేహభావం పోనందువల్లనే.

ప్రమత్తుడవై ప్రతిజ్ఞా కాలాన్ని మరిచిపోయావు.

అది గుర్తు చెయ్యడానికే రామానుజుడు వచ్చాడు. మన ప్రయత్నం మనం ప్రారంభించాలి. ఇప్పుడాయన పలికే పరుష వాక్యాలు వినక తప్పదు. చేతులు జోడించి లక్ష్మణుని ముందు నిలబడు, నీ అపరాధానికిది తప్పదు." రాజు హితవు కోరే మంత్రి చెప్పవలసిన మాటలు నిర్భయంగా చెప్పాడు.

"రాముడు ధనుస్సు సంధిస్తే దేవాసురగణాలు గజగజ లాడతాయి. ఆయనకు కోపం వస్తే మనం ఓరిమితో ఆయన పాదాలమీదపడి శాంతింపజేసు కోవాలి. భార్య భర్త దగ్గర ఎలా ఉంటుందో అలా ఉండాలిప్పుడు నువ్వు.

ఆయన ఎంతటివాడో ఎరుగుదువు. చేసిన ఉపకారం అనుభవిస్తున్నావు. ఇప్పుడింక రామశాసనమే కాదు రామానుజుని శాసనం కూడా శిరోధార్యమే" అన్నాడు.

చేసిన ఉపకారాన్ని విస్మరించకపోవడం – అని ప్రారంభించాడు. మనకు తెలుసు, హనుమంతునికీ తెలుసు – సుగ్రీవుడు మదిరాపానంతో

మదవతీ పరీరంభంలో అన్నీ మరిచిపోయాడని. కాని ఆయన తన ప్రభువు కనక అలా ఆరంభించి, వాని ప్రమత్తతను గుర్తింపజేసి, ఆ తరువాయి కర్తవ్యం బోధించాడు. హనుమంతుని మాటలు పైకి కనిపించే అర్థాన్ని కాక వ్యంగ్య మర్యాదలో సుగ్రీవుని కాలజ్ఞాన రాహిత్యాన్ని తెలుపుతాయి. సాహిత్యం ఆలోచనామృతం అనే వాక్యం మనసులో ఉంచుకుని హనుమంతుని ప్రసంగం వినాలి. మననం చేసుకోవాలి. లక్ష్మణుని కంటె తీవ్రంగానే చెప్పాడు. కాని మాటలలో పౌరుష్యం లేకుండా మృదువుగానే మందలించాడు. అదీ రాముని ప్రశంసలందుకున్న మారుతి సంభాషణా చాతుర్యం.

సుగ్రీవుడు మదిరాపాన మత్తులో ఉండగా, లక్ష్మణుని రాక సమయంలో ఎలా మాట్లాడాడో చూశాం.

## స్వయంప్రభతో

ఇది రామాయణం చదివేవారు కూడా పట్టించుకోని సన్నివేశం;

వానరులలో కొందరిని అంగదుని నాయకత్వాన దక్షిణ దిశగా సీతాన్వేషణకు పంపాడు సుగ్రీవుడు, వారు తిరిగి తిరిగి ఆకలి, దాహం బాధిస్తుంటే ఒక బిలద్వారం చెంతకు చేరారు. చుట్టుపక్కల మంచినీటి చెరువుకాని, ఫలాలున్న వృక్షం కాని లేదు. ఆ బిలద్వారం నుంచి తడి ముక్కులతో జలపక్షులు రావడం చూసి హనుమంతుడు యీ కొండగుహలోపల సరోవరం ఉన్నదని భావించి :

ఈ బిలం నుండి హంసలు, క్రౌంచపక్షులు, సారసాలు, తడిసిన రెక్కలతో చక్రవాకాలు వస్తున్నాయి చూశారా, అంటే ఈ లోపల సరోవరమో, దిగుడుబావియో, ఉండి తీరుతుంది. బిలద్వారం దగ్గర వృక్షాలు కూడా ఉన్నాయి. అంటూ ముందడుగు వేశాడు.

చెట్టు పెరగాలంటే నీరుండి తీరాలి అనే ఊహ తెలిసినవాడు కనుకనే ఆ మాట అనగలిగాడు.

ఈ గుహకు స్వయంప్రభా బిలం అని పేరు. ఇది మయుడు

నిర్మించాడు. ఈ మయుడే మహాభారతంలో పాండవులకు సభాభవనం నిర్మించిన దానవశిల్పి.

అదే మయసభగా ప్రఖ్యాతమైంది. అక్కడ దుర్యోధనుడు పరాభవం పొందిన కారణంగా భారతంలో జూదం ప్రవేశించి అల్లకల్లోలం చెలరేగింది. అందువల్ల అది మనకు గుర్తున్నది. అంతకుమించిన అద్భుతమైన భవనం యీ బిలంలో మనం చూడబోతున్నాం.

బిలద్వారం నుండి వానరులు నాలుగడుగులు వేశారు. అంతే కటిక చీకటి, కన్ను పొడుచుకున్నా కనపడదు. ఒకరి చెయ్యి పుచ్చుకుని ఒకరు నడుస్తున్నారు. చీకటిలో గాలి తిరిగినట్లు తిరుగుతూ ముందుకు నడవగా కాంతి గోచరించింది. ముందడుగు వేశారు.

సువర్ణ కాంతులీనే వృక్షాలు, వాటిని అల్లుకొని లతలు, అన్నీ పూలగుత్తులతో సువాసనలీనుతూంటే, చెట్లమీద పండిన ఫలాలు నోరూరిస్తున్నాయి. వైఢూర్యాలు పొదిగిన శిలా వేదికలు, బంగారు రంగు చేపలూ, తాబేళ్ళూ సంచరించే సరోవరాలు స్వచ్ఛమైన జలాలతో అలరారుతున్నాయి.

బంగారు కిటికీలకు ముత్యాల తెరలతో వెండి బంగారు భవనాలు, పగడాల శోభలీనే తుమ్మెదలు పూలలోని మకరందం త్రాగుతున్నాయి.

అక్కడ భోజనానికి, పానానికి అన్నీ రజత, సువర్ణపాత్రలే; బంగారు తీగలకు చుట్టిన ముత్యాల జాలరులతో పల్లకీలు, దివ్యాంబరాలు, రత్నకంబళ్లు ఎటుచూసినా రత్న, మాణిక్య, వైఢూర్య, స్వర్ణవస్తుజాలమే.

ఇది మయుడు నిర్మించుకున్న బిలమందిరం. ఆ మందిరంలో తిరుగుతూ తిరుగుతూ వానరులు ఒక తపస్వినిని చూశారు. లేడిచర్మం ధరించి, పద్మాసనం వేసి కూర్చున్న ఆ తాపసి దగ్గరకు వెళ్ళి చేతులు జోడించి, తలవంచి, హనుమంతుడు :

అమ్మా, ఈ బిలమందిరం ఎవరిది, నీవెవరవు? అని ప్రశ్నిస్తూనే తన తప్పు తెలుసుకుని –

"అమ్మా! ఆకలి బాధతో దాహపీడతో ఈ అంధకార బంధురమైన బిలమార్గాన వచ్చాం. ఇక్కడివన్నీ చూడగానే మాకు ఆశ్చర్యంతో మనస్సు పనిచేయడం మానివేసింది.

ఇంత అద్భుతమైన సువర్ణ మాణిక్య వైఢూర్య భవనాలు ఎవరివి? నీ తపశ్శక్తితో యివన్నీ సాధించావా? మరే మహాతపస్వి శేఖరుడైనా యీ అద్భుతనిర్మాణం సాధించాడా! అనుగ్రహించి ఈ విశేషాలు చెప్పు" అన్నాడు.

ఇక్కడ కూడా రామునితో మాట్లాడినట్టే, నీ వెవరవు? ఈ మందిరం ఎవరిది? అని ప్రశ్నించాక తన తప్పు తెలుసుకున్నాడు. తమ విషయం చెప్పడం మరిచాడు.

అక్కడికెందుకు రావలసి వచ్చిందో చెప్పాడు. ఆకలితో, దప్పికతో అలసివచ్చాం, క్షుత్తు, పిపాస ఎంత బాధిస్తాయో, ఆ బాధలో ప్రాణి ఏ సాహసానికైనా తెగిస్తుందనే విషయం మానవప్రాణికి తెలిసి తీరుతుంది కనుకనే అలా మొదలు పెట్టాడు.

అది మహారణ్యం, అందులో కొండగుహ, బిలద్వారం – అంటే అది ఎంత రహస్య ప్రదేశమో తెలిసి ఉండాలి. అటువంటి చోట ఒక తపస్విని ముందు ఎలా ప్రసంగం ప్రారంభించాలో చూపించాడు. ఆ తరువాయి ఆవిడ యిచ్చిన ఫలాలు ఆరగించి, ఆవిడ అనుగ్రహంతో సాగర తీరానికి చేరారు.

## వానరసేనతో

సముద్రాన్ని చూడగానే యోధులందరూ నీరుకారి కూలబడ్డారు. సముద్రం ఆవలి ఒడ్డు కనబడటం లేదు, అది దాటి లంకలో సీతాదేవిని చూసి రావాలి, లేకుంటే ఎవడికీ ప్రాణాలుండవు.

నెల దాటకుండా సీతాదేవిని చూసి రాకపోతే మరణదండన, అది సుగ్రీవాజ్ఞ.

స్వయంప్రభ గుహ దగ్గరే నెలదాటింది, దానికితోడు సీతాదేవిని చూడకుండా వెడితే యింకేముంది. వానరులందరి ప్రాణాలు పోతాయి. ఆ

దశలో అందరూ ప్రాయోపవేశానికి సిద్ధపడుతుంటే, వారి నాయకుడు అంగదుడు –

వానర వీరులారా! మీలో ఎవరెవరు ఎంతెంత దూరం లంఘించగలరో చెప్పండి, అనగా పది యోజనాల నుంచి ఎనభై యోజనాలు దాటే శక్తికలవారు తమ తమ ప్రతాపం వ్యక్తం చేశారు.

అదంతా వింటున్న జాంబవంతుడు :

వయోభారం వల్ల శక్తి తగ్గి యిలా ఉన్నాను కాని, నేను అవలీలగా నూరుయోజనాలు దాటి తిరిగి రాగలిగే వాడిని. ఇప్పుడైనా తొంభై యోజనాలు అనాయాసంగా వెళ్ళి రాగలను అంటాడు.

ఎవరి ప్రతాపం వారు చెప్పి దీనవదనులై కూర్చున్నారు వానరులందరూ. హనుమంతుడు ఏమీ మాట్లాడలేదు. ఒక వార మౌనంగా కూర్చున్నాడు. జాంబవంతుడు వాని దగ్గరగా వెళ్ళి :

వీర వానర లోకస్య
సర్వశాస్త్ర విశారద
తూష్ణీం ఏకాంత మాశ్రిత్య
హనుమాన్ కిం న జల్పసి ॥

హనుమన్ హరి రాజస్య
సుగ్రీవస్య సమోహ్యసి
రామలక్ష్మణ యోశ్చాపి
తేజసాచ బలేనచ ॥

నిఖిల వానర శ్రేష్ఠుడా! శాస్త్ర విశారదా! ఇంతటి వాడివి నువ్వు ఏమీ మాట్లాడకుండా యిలా ఉదాసీనంగా కూర్చుని పోయావేం!

మన ప్రభువు సుగ్రీవునితో సమానుడవు, తేజస్సులో, బలంలో రామలక్ష్మణులంత వాడివి. కాశ్యపుడైన గరుత్మంతుడు యీ సాగరం మీద ఆహారం కోసం అటూ ఇటూ ఎగరడం చూశాను. ఆయన రెక్కలలో ఉన్న శక్తి నీ భుజాలలో ఉన్నది. విక్రమంలో, వేగగమనంలో ఆయనతో సమంగా నిలబడగలవాడవు.

బలం బుద్ధిశ్చ తేజశ్చ
సత్వం చ హరిపుంగవ
విశిష్టం సర్వ భూతేషు
కి మాత్మానం న బుధ్యసే ॥

"బలంలో బుద్ధిలో తేజస్సులో శక్తిలో నీ అంతటివాడు భూతకోటిలో లేడు. అంత వాడిని యిలా కూర్చుండి పోయావేమయ్యా!" అని ప్రశంసిస్తూ హనుమంతుని జనన గాధను వినిపించి, ఆయన శక్తిని వ్యక్తం చేశాడు.

ఆ క్షణం వరకూ హనుమంతుని గురించి ప్రస్తావన యింతగా ఎక్కడా లేదు. అందునా జాంబవంతుని వంటి వృద్ధుని నోట యిటువంటి ప్రశంస రావడం మరీ విశేషం. హనుమంతునివల్ల కార్యం సాగాలి. సాగాలీ అంటే ఎలా మాట్లాడాలో చూపించాడు, వృద్ధుడైన జాంబవంతుడు. అదే అనుభవం కలవారు మనతో ఉంటే విషమ సమస్యలు ఎదురైనపుడు ఎలా పరిష్కరించుకోవచ్చునో రామాయణం బోధిస్తుంది, ఈ ఘట్టంలో.

జాంబవంతుని మాటలు విన్నాడు హనుమంతుడు : శరీరాన్ని పర్వతమంత విశాలం చేసి –

మా తండ్రి వాయుదేవునికి అగ్ని ప్రాణమిత్రుడు, స్నేహితుని కోసం పర్వత శిఖరాలు నేలకూల్చిన వాయుసుతుడను. బలంలో, వేగగమనంలో ఆయనతో సమానుడను.

ఆకాశాన్ని తాకుతున్న మేరువుచుట్టూ వెయ్యి ప్రదక్షిణాలు చెయ్యాలన్న వాంఛ నాకున్నది. సముద్ర జలాలతో భూమిని ముంచగలను,ఆ జలాలను ఆకాశానికి లేపి జలచరాలను భూమిమీదికి రాల్చగలను.

ఉదయగిరి మీద సూర్యునితో బయలుదేరి ఆయన ఆకాశమధ్యానికి వచ్చేసరికి నేను పడమటి కొండకు ప్రదక్షిణం చేసి తిరిగివచ్చి దారిలో ఆయనను దర్శించగలను, మళ్ళీ దక్షిణంగా వెళ్ళి ఉత్తరంగా తిరిగి భూమిమీద కాలుమోపకుండా సూర్యభగవానుడు ఆకాశ మధ్యాన ఉండగా ఆయనను సమీపించి వందనాలర్పించగలను.

వైనతేయుడు, వాయుదేవుడు తప్ప నాతో ఎగురగలవాడు లేడు, సముద్రంలోకి దూకి క్షణంలో ఆకాశానికి నే నెగురుతూంటే మెరుపు తీగలా ఉంటాను, భూమ్యాకాశాలను ఆక్రమించిన త్రివిక్రముడేమో అనే భ్రమ కలుగుతుంది.

లక్ష్మి సమానురాలైన సీతాదేవిని చూసి రాగలననే ధైర్యం నా మనసులో, బుద్ధిలో, చేష్టలో (త్రికరణాలు) కలుగుతున్నది. గరుడుని శక్తి, వాయుదేవుని వేగం వున్న వాడిని. లంకలో వెదకడం కాదు, లంకను మూలమట్టం పెళ్ళగించి తెచ్చి మీ ముందుంచుతాను, నిర్భయంగా ఉండండి, అన్నాడు.

ఈ సన్నివేశంలోనే హనుమంతుడు ఎక్కువగా మాట్లాడాడు, దానికి కారణం ఆలోచిస్తే, వానరయోధులందరూ నిరాశతో ప్రాణాలు వదిలే దశలో ఉన్నారు. వారందరికీ ధైర్యం కలిగించాలి. నిస్పృహలో వున్న వారికి ప్రాణాలమీద ఆశ కలిగించాలి. అందుకే అంతగా ప్రసంగించాడని వ్యాఖ్యాతలు నిశ్చయించారు.

అప్పుడు జాంబవంతుడన్నాడు.

నాయనా, నిస్సందేహంగా మనవారందరికీ సుఖంగా బ్రతికే అవకాశం కలిగించే శక్తి నీకే ఉన్నది. అందరూ నీ క్షేమాన్నే కోరుతూంటారు.

ఋషిణాంచ ప్రసాదేన
కపివృద్ధ మతేనచ
గురూణాంచ ప్రసాదేన
ప్లవస్య త్వం మహార్ణవం ॥

మహర్షుల అనుగ్రహం, వంశవృద్ధుల ఆశీస్సులు, గురువుల శుభకామము సాగరతరణంలో నీకు తోడ్పడతాయి. నువ్వు తిరిగి వచ్చే వరకూ మేము ఒంటికాలిమీద నిలబడి చూస్తూనే ఉంటాం, అన్నాడు.

హనుమ : నేను లంఘిస్తుంటే ఆ వేగాన్నీ, బరువునూ భూమి భరించలేదు కనక గిరిశిఖరం మీదకెక్కి దూకుతా, అంటూ మనస్సును లంకలో నిలిపాడు.

"జగామ లంకం మనసా మనస్వీ"

మనస్వియైన హనుమంతుడు మనసును లంకలో ప్రవేశపెట్టాడు. సంకల్పం కలిగిందీ అంటే అది సంపూర్ణమైనట్లే – అదే హనుమంతుని లక్షణం. మనోజవం అనే దాని అర్థం యిదే. ఇక మారుతతుల్య వేగుని చూడబోతున్నాం.

తతో రావణ నీతాయాః
సీతాయాః శత్రు కర్శనః
ఇయేష పదమన్వేష్టుం
చారణా చరితే పథిః ॥

సీతాదేవిని అన్వేషించడానికి చారణులు చరించే మార్గాన బయలు దేరాలని శత్రునాశన సమర్థుడైన హనుమంతుడు సంకల్పించాడు. శతయోజన విస్తీర్ణమైన సముద్రం దాటడం ఎవరూ చెయ్యలేనిది, అటువంటి అసాధ్యాన్ని సాధించడానికి నిశ్చయించి మెడముందుకు సాచి తల పైకెత్తాడు. కొండమీది లేత పచ్చిక బయళ్ళలో కొంతసేపు గంతులు వేస్తూ విహరించాడు.

స సూర్యాయ మహేంద్రాయ
పవనాయ స్వయంభువే
భూతే భ్యశ్చాంజలిం కృత్వా
చకార గమనే మతిం

లోకసాక్షియైన సూర్య భగవానునికీ, బలాధిపతి ఇంద్రునికీ, పితృపాదుడైన వాయుదేవునికీ, ప్రజాపతి బ్రహ్మకూ, భూతకోటికీ నమస్కరించాడు.

పర్వదినాలలో సాగరం పొంగేటట్లు శరీరాన్ని పెంచుతున్నాడు. కాళ్ళూ చేతులూ గట్టిగా మర్దించాడు. పర్వతం ఊగిసలాడింది. ఆ ఊపుకి గుహలలోని జంతువులు భయంతో బైటపడ్డాయి. మహా సర్పాలు బుసలు కొడుతూ రాళ్ళను కరుస్తున్నాయి.

ఒక్కసారి జూలు సడలించి మేఘగర్జన చేశాడు. గరుత్మంతుడు పట్టిన పామును విదిలించినట్లు తోకను ఊగిసలాడించాడు.

భుజాలు బిగించాడు, కాళ్లు వొంచి, నడుం సన్నగిల్లజేసి, కన్నులు పైకెత్తి, వాయువును బంధించి హృదయంలో నిలిపి, చెవులు ముడిచి, వానర యోధులను చూస్తూ :

యథా రాఘవ నిర్ముక్తః

శరః శ్వసన విక్రమః

వాయువేగంతో వెళ్ళే రామబాణంలా లంకానగరంలో ప్రవేశిస్తాను. అక్కడ సీతాదేవి కనిపించకపోతే సరాసరి దేవలోకం వెడతాను. అక్కడా కనిపించకపోతే లంకచేరి రావణుని బంధించి తీసుకువస్తాను అన్నాడు.

నలభై నాలుగు శ్లోకాలు హనుమంతుని వర్ణన, వర్ణన అంతా ఆయన సాహసం, శక్తి, ఉత్సాహం, బలం వీటితోనే సాగింది.

మాట్లాడడం వచ్చేసరికి రెండే మాటలు –

రామబాణంలా వాయువేగంతో వెడతాను.

సీతాదేవి కనిపించకపోతే రావణాసురుణ్ణి బంధించి తెస్తాను. ఎంత ధైర్యంతో ఉన్నాడో, ఏ శక్తితో వెడుతున్నాడో తెలియజేశాడు. బయలుదేరడానికి ముందు సాగించిన ఉపన్యాసం ఇక్కడలేదు. రెండే రెండు పనులు –

సీతను చూడడమో –

రావణుని బంధించడమో –

వానరుల ప్రాణ రక్షణకు అంతకంటె అవసరం లేదు. లేచిన వెంటనే హనుమంతుడెలా వున్నాడో, సాగుతున్న ఆయన ఎలా వున్నాడో అంతా ఓ వంద శ్లోకాలలో ప్రదర్శించాడు మహర్షి.

దానిని చదువుతూంటే ఎగురుతున్న హనుమంతుని చూస్తూ ప్రత్యక్ష వ్యాఖ్యానం చేస్తున్నట్లు మన కనుల ముందు ఆ రూపం గోచరిస్తుంది. ఆయన దర్శనం ఎంత విశిష్టమో, దానిని అక్షరాలలో బంధించి మన మనస్సు ముందు బొమ్మ కట్టించడంలో ఆ ప్రతిభ ఎంత ప్రకాశిస్తుందో తెలియాలంటే సుందరకాండ మీద మనస్సు పెట్టి మళ్ళీ మళ్ళీ చదువుకోవాలి, చదివించుకుని వ్యాఖ్యానింపించుకోవాలి.

దారిలో మైనాకుడు విందుచేస్తానన్నాడు, సురస మింగుతానంది ఛాయాగ్రాహి సింహిక కబళించబోయింది.

ఈ విందులనూ, ఆ అవరోధాలనూ తిరస్కరించి లంక కోటగోడ చేరుతాడు. మైనాకునితో, సురసతో మాట్లాడిన మాటలు ముక్తసరిగా కాలోచితంగా వున్నాయి. కార్యదీక్షలో ఉన్నపుడు, దృష్టి లక్ష్యసాధనపై కేంద్రీకరించాలి తప్ప వృథా కాలయాపన చేయరాదన్నది, హనుమంతుని మార్గం.

**లంఖిణితో**

లంక ఒడ్డున కొండమీద దిగుతూ – ఇంత శరీరాన్ని రాక్షసులు చూస్తే నా గురించి తెలుసుకోవాలనుకుంటారు. అనుకుంటూ అజ్ఞానం తొలగిన జీవుని వలె, బలిచక్రవర్తి సమీపానికి వెళ్ళిన వామనుని వలె, రూపాన్ని చిన్నది చేశాడు.

కొండమీద తిరుగుతూ –

శతాన్యహం యోజనానాం
క్రమేయం సుబహూన్యపి
కింపున స్సాగరస్యాంతం
సంఖ్యాంతం శతయోజనం ॥

ఈ నూరు యోజనాలేనా, ఎన్ని నూర్ల యోజనాలయినా యిలా వెళ్ళగలను, అనుకున్నాడు.

అంత దూరం ప్రయాణం చేసిన అలసట కనిపించలేదు. హాయిగా తిరుగుతూ లంకా నగరాన్ని చూస్తున్నాడు.

ఆ సమయంలో లంకానగర అధిష్టాన దేవత ఎదురుగావచ్చి :

ఓ వానరుడా! ఎవడవురా; ఏం పనిమీద వచ్చావు; రావణ రక్షితమైన లంకలో అడుగు పెట్టలేవు; నీ సంగతేమిటో వాస్తవం దాచకుండా చెప్పు అంది.

కథయిష్యామి తే తత్త్వం
యన్మాం త్వాం పరిపృచ్ఛసి ।
కాత్వాం విరూప నయనా
పురద్వారేన తిష్ఠసి
కిమర్థం చాపి మాం రుద్ధ్వా
నిర్భర్త్సయసి దారుణా ॥

ఇదీ హనుమంతుని నోట వెలువడిన మొదటి మాట

నీకు మొత్తం అంతా చెబుతాను, అన్నాడు.

నిజానికిక్కడ హనుమంతుడు కాక మరెవరయినా యిలా మాట్లాడతాడా!

అంతటి శక్తిశాలి ముందు ఆ ఆడది ఏ పాటి!

అయినా నీ ప్రశ్నకి సమాధానం చెబుతా అన్నాడు వినయంగా. అంటూనే ఈ భీకరాకారంతో, మిడిగుడ్లతో నగర ద్వారంలో నిలబడి అడ్డగించి, నన్నెందుకు బెదిరిస్తున్నావు? అన్నాడు.

ఆగ్రహంతో వచ్చినవారి ముందు మనమూ ఆవేశంతో ఉండరాదు, అంతమాత్రాన లొంగవలసిన పనిలేదు. అందుకు అనుగుణంగా నీ ప్రశ్నలన్నిటికీ సమాధానం చెబుతా, నీ సంగతేమిటో తెలియకుండా ఎంత చెప్పాలో, ఏం చెప్పాలో తెలియదు కదా! అనకుండా –

నా దారి కడ్డు నిలిచిన దోషివి నువ్వు, ముందు నీ సంగతి చెప్పు అన్నాడు.

ఇలా ఎక్కడికక్కడ ఎంత స్పష్టంగా, క్లుప్తంగా సూటిగా మాట్లాడాలో నేర్పుతాడు హనుమంతుడు.

అనగానే ఆమె :

రావణుని ఆజ్ఞానుసారం ఈ లంకానగర రక్షణ భారం వహిస్తున్నాను. నన్ను కాదని లంకలో అడుగుపెట్టలేవు. నీ ప్రాణాలు తీసేస్తాను అంది.

హనుమ :

ద్రక్ష్యామి నగరీం లంకాం
సాట్ట ప్రాకార తోరణాం
ఇత్యర్థమిహ సంప్రాప్తః
పరం కౌతూహలం హిమే ॥
వనాన్యుప వనానీహ
లంకాయాః కాననానిచ
సర్వతో గృహ ముఖ్యాని
ద్రష్టు మాగమనం హిమే ॥

"ప్రాకారాలతో, బురుజులతో అలరారే కోట చూస్తున్నాను, ఆశ్చర్యంగా ఉంది. వీటితోపాటు లంకలో వనాలు, ఉద్యానాలు, భవనాలు చూసి వెడదామని వచ్చాను."

కోటనూ భవనాలూ, వనాలూ చూడడానికే వచ్చాడా!

చూడడానికి వచ్చానన్నాడు కదా, అంటే ఎంతటి వారితోనయినా నాలుగు మంచి మాటలు మాట్లాడితే మన పని సుఖంగా నెరవేరుతుంది, అందుకే అద్భుతంగా ఉంది మీ నగరం – అది చూసి వెడతాను, అని ప్రశంసించాడు.

ఈ రెండు ప్రసంగాలలో ఆయన వాక్చాతురి, లోకజ్ఞత, వ్యవహార పరిజ్ఞానత్వం మనకు స్పష్టమవుతాయి.

లంకలో ప్రవేశించాడు హనుమంతుడు.

**తనలో తాను**

కోటను సమీపించాడు.

సీతాన్వేషణ ప్రారంభించాడు.

నగర రాజ వీధులలో తిరిగాడు.

భవనాలన్నీ అన్వేషించాడు.

అన్వేషిస్తూ అంతఃపురంలోని రాణివాసం చేరాడు.

అర్ధరాత్రి వరకూ పానగోష్ఠిలో ఉండి అలసి నిద్రకు జారుతున్న నారీమణులను చూశాడు.

హంసతూలికా తల్పంమీద నిద్రిస్తున్న మహావీరుణ్ణి చూసి, ఇతడే రావణుడు అయి ఉంటాడు అనుకున్నాడు.

రమణీమణులతో తారాశోభితమయిన గగనంలా ఉన్న ప్రదేశంలో

అందరి సౌందర్యాన్నీ తలదన్నుతూ రత్నమాణిక్య ముక్తాహారాలతో అంతఃపురానికే అలంకారంగా సువర్ణ కాంతి దేహంతో నిద్రించే రమణీమణిని చూసి –

నా జన్మ చరితార్థమయింది జానకీదేవిని చూశాను. రామకార్యం నెరవేరింది అనుకున్నాడు. తోక పైకెత్తి నేలమీద కొట్టి ఆ తోకను ముద్దుపెట్టుకుని నేలమీద దూకుతూ, గంతులు వేస్తూ స్తంభం మీద నుంచి స్తంభం మీదకు దూకుతూ, సంతోషిస్తూ కపి ప్రకృతి ప్రదర్శించాడు.

"ఆస్ఫోటయామాస చుచుంబ పుచ్ఛం
స్తంభానరోహన్ నిపపాత భూమౌ
ననంద చిక్రీడ జగౌ జగామ
నిదర్శయన్ స్వాం ప్రకృతిం కపీనాం"

అలా ఆనందించింది ఒక్క క్షణమే –

మరుక్షణంలో ఆమె రామపత్ని కాదు అని గ్రహించాడు.

సీతాదేవిని అన్వేషిస్తున్న హనుమంతుడు, అంతఃపురంలోని అందరు స్త్రీల సౌందర్యాన్నీ తలదన్నే సౌందర్యంతో ఉన్నది, ప్రత్యేకంగా తీర్చి దిద్దబడిన పర్యంకం మీద నిద్రిస్తున్నది, ఆవిడను అపహరించి తెచ్చిన రావణ రాక్షసుడు సమీపంలోనే ఉన్నాడు, కనక ఆమె సీతాదేవియే అయివుంటుంది అనుకున్నాడు మండోదరిని చూసి. ఎందువల్లనంటే సీతాదేవిని రావణుడు తన అంతఃపురంలోనే ఉంచే అవకాశం ఉంది, తన రక్షణలో.

మరుక్షణంలోనే మారింది హనుమంతుని ఆలోచనా ధోరణి.

సీతాదేవి పాతివ్రత్యాన్ని గురించి విన్నాడు, మునుపే.

రాముని యందు ఆవిడకు ఉన్న అనురాగం తెలుసు.

అటువంటి అమ్మవారు అన్నపానాలు ముట్టదు. అలంకారాలు దరిజేరనివ్వదు. హంసతూలికా తల్పాలు అధిరోహించదు. అంతఃపురంలో సకల సౌకర్యాలు అనుభవిస్తూ నిశ్చింతగా నిద్రపోలేదు. కాబట్టి ఈవిడ జానకీదేవి కాదు అనుకున్నాడు.

అంతఃపురం విడిచి ముందుకు సాగాడు.

ఆరంభించిన పని పూర్తిచేసినట్లు అనిపిస్తుంది ఒక్కొక్కసారి. ఆ భ్రమలో పడిపోయామో కర్తవ్యదీక్ష సడలుతుంది. అప్పుడు వివేకం పనిచేసి సక్రమ మార్గాన నడపాలి. ఎంతటి ధీమంతుడయినా ఒక్కొక్కసారి పొరపడతాడు. హనుమంతుడికి కూడా పొరపాటు తప్పనప్పటికీ ధీమంతుడు కనక త్వరలోనే గ్రహించి దిద్దుకున్నాడు.

* * *

అన్వేషణ కొనసాగిస్తూ –

పానశాలలోకి ప్రవేశించాడు, హనుమంతుడు

అర్థనగ్నంగా, పూర్ణ నగ్నంగా ఉన్నారు అక్కడి నారీజనం.

ఆ స్థితిలో ఉన్న వారిని చూసిన హనుమంతుని మనస్సు చలించలేదు. చలించలేదు సరికదా పశ్చాత్తప్తమయింది.

పరస్త్రీ దర్శనమే మహాపాతక హేతువు కాగా ఈ దశలో ఆచ్ఛాదనా రహితులై ఉన్న ఇందరిని చూడడం ఎంత పాపం, అని క్షణం ఆలోచించి –

అమ్మవారిని అన్వేషిస్తూ ఈ పానశాలలో అడుగుపెట్టాను తప్ప వీరి నగ్న సౌందర్యాన్ని వీక్షించడానికి కాదు.

కాక ఈ దశలో ఉన్న ఇందరిని చూసినా నా మనస్సు ఏ వికారానికీ లోను కాలేదు. మనస్సు సడలనంతసేపూ ఏ పాపమూ మనల నంటదు అనుకున్నాడు.

మనోహి హేతుః సర్వేషాం

ఇంద్రియాణాం ప్రవర్తనే

శుభాశుభా స్వవస్థాసు
తచ్చ మే సువ్యవస్థితమ్ ॥

ప్రత్యక్షంలో నగ్నసుందరులు
పరవశింపజేసే పర్యంకాలు.
పారవశ్యానికి అవసరమయిన పానపాత్రలు –
అయినా చలించని మనస్సు కలవాడాయన.

హనుమంతుడు ఏ పాన పాత్ర అందుకున్నా ఏ సుందరీమణి మీద చెయ్యి వేసినా అడిగేవారు లేరు ఆ పానశాలలో.

అనుభవించే అవకాశం లేక, అనుభవ సామాగ్రి దొరకక మనస్సును వైరాగ్యంతో నడుపుకునే వారెందరో ఉంటారు.

వయసులో ఉన్నవాడికి కావలసిన సౌకర్యాలన్నీ అందుబాటులో ఉన్నా వాటి వయిపు మనసు కదలనివ్వక పోవడంలో ఉంది, వ్యక్తిత్వం.

దారిద్ర్యంలో ఉపవాసం గణనీయం కాదు. సర్వసమృద్ధులూ ఉన్నా, జిహ్వా చాపల్యానికి లొంగనివాడే సమర్థుడు.

ఆ సామర్థ్యాన్ని మనకందించిన మహోన్నత వ్యక్తి హనుమంతుడు.

సీతాన్వేషణా దృష్టి తప్ప మరొక ఆలోచన రానీయడు మనసులోకి.

ఏ పనిమీద మనం ఉంటామో, దానిమీదనే మనస్సు ఏకాగ్రం కావాలి. వ్యామోహాలకూ, ప్రలోభాలకూ లొంగకూడదు. లొంగనివారికే కార్యసిద్ధి కలుగుతుంది.

✳ ✳ ✳

పానశాల విడిచి రావణ భవనంలోని లతాగృహాలూ నిశాసౌధాలూ అన్వేషించాడు.

ఆలోచనలో పడ్డాడు.

ఈ లంకలో అంగుళమాత్రం కూడా విడిచి పెట్టకుండా తిరిగి చూశానే ఎక్కడా జానకీదేవి జాడలేదు.

ఈ దుర్బుద్ధి అయిన రావణుని చేతులలో హింసపడడం ఇష్టం లేక ఆ ఇల్లాలు ప్రాణాలు వదిలిందేమో. ఈ క్రూర రాక్షస వికృతాకారాలు చూడడంతో ఆవిడ గుండె ఆగిందేమో.

ఇప్పుడు తిరిగి వెళ్ళి రామభద్రునికి ఏం చెప్పాలి.

జానకీదేవి కనబడలేదనా.

అది వినగానే వియోగభారంతో ఉన్న రామభద్రుడు ప్రాణాలు వదులుతాడు. ఉత్తరక్షణంలో లక్ష్మణస్వామి మిగలడు. ఈ వార్త అయోధ్యానగరం చేరుతుంది. భరత శత్రుఘ్నులు ప్రాణత్యాగం చేస్తారు. కౌసల్య, సుమిత్ర, కైకేయి వారి బంధుపరివారం అందరూ ఆత్మాహుతి చేసుకుంటారు.

ఇక్కడ కిష్కింధలో సుగ్రీవుడు ప్రాణస్నేహితుని మరణాన్ని చూస్తూ బ్రతకగలుగుతాడా! ఆయనతోనే ఆయన భార్య రుమకూడా వెళ్ళిపోతుంది. అక్కడితో ఆగదు. తార, అంగదుడు దేహయాత్ర చాలిస్తారు. ఈ దుఃఖాన్ని భరించలేక మా వానర వీరులందరూ ఆత్మత్యాగం చేస్తారు.

అయోధ్యలో, కిష్కింధలో నరులూ, వానరులూ మిగలరు. ఇందరు నాశనం కాకుండా ఉండాలంటే ఒక్కటే మార్గం.

నేను తిరిగి వెళ్ళకుండా ఇక్కడే దేహయాత్ర చాలిస్తాను.

కిష్కింధలో, అయోధ్యలో అందరూ నా రాకకోసం ఎదురుచూస్తూ జీవించి ఉంటారు అని యోచించి, ఆత్మహత్యా సన్నద్ధుడయ్యాడు.

హనుమంతుని ఆలోచనలో ఎక్కడా తన ప్రాణాన్ని గురించిన ఆలోచనలేదు. కార్యాన్ని సాధించనట్లయితే ఎంతమంది ప్రాణాలు పోతాయో ఆలోచించాడు.

తిరిగి వెళ్ళినట్లయితే... అనే ఆలోచనలో కూడా స్వార్థం కనపడదు మనకి; వానరులందరూ తన రాకకోసం ఆశగా ఎదురుచూస్తూ జీవించి ఉంటారు అనే ఊహ తప్ప.

ఈ సన్నివేశంలోనే కాదు, రామాయణం మొత్తం మీద ఎక్కడా

ఏ పనీ హనుమంతుడు స్వప్రయోజనానికి చేసినట్లు కనపడదు.

ఆత్మహత్యా సన్నద్ధుడయిన వాడు మరోసారి ఆలోచించాడు –

శోకానికి హృదయంలో చోటిచ్చావెూ ఎందుకూ పనికి రాకుండాపోతాం. దాన్ని పరిత్యజించి ఉత్సాహంతో కార్యసాధనకు ఉపక్రమిస్తే ఫలితాన్ని సాధించి శ్రేయస్సును పొందగలుగుతాం.

వినాశే బహవో దోషాః జీవన్ భద్రాణి పశ్యతి ।

తస్మాత్ప్రాణాన్ ధరిష్యామి ధ్రువో జీవతి సంగమః ॥

అని ఆలోచిస్తూ భవనం వెలుపలి ప్రాకారం మీదికి వచ్చి ఎదురుగా దృష్టి సారించాడు.

అశోకవనం కనిపించింది.

ఔరా మనం ఇంతవరకూ ఈ వనంలోకి వెళ్ళినట్లు లేదే.

రావణుడు అపహరించిన రామచంద్రుని ధర్మపత్నిని ఇక్కడ నేను దర్శించగలగాలి.

అనుకుంటూ ఆ ప్రాకారం మీద నుంచి అశోకవనంవైపు సాగుతుంటే శరీరం పులకించింది. హృదయంలో తెలియని సంతోష తరంగాలు పెల్లుబికాయి.

ఆ వనంలోని శింశుపా వృక్షంమీద కూర్చున్నాడు. అన్ని వైపులా చూస్తున్నాడు హనుమంతుడు. నెమ్మదిగా దృష్టిని క్రిందికి సారించాడు. కృశించిన వదనంతో, మలిన వస్త్రంతో, రాక్షసజన పరివృతయై, క్రూర మృగాల మధ్య ఆడలేడిలా కన్పించే ఆవిడను చూసి ఈవిడే జానకీదేవి అయి ఉండాలి అనుకున్నాడు.

రామచంద్రుడు చెప్పిన లక్షణాలన్నిటినీ ఏకత్వం చేసుకున్న హనుమంతునికి ఆవిడ నిస్సందేహంగా జానకీదేవియే అనే విశ్వాసం కలిగింది.

ఒక కార్యాన్ని ప్రారంభించినపుడు కార్యసిద్ధికి సంపూర్ణ ప్రయత్నం సాగించాలి.

సంపూర్ణ ప్రయత్నం జరిగింది, అయినప్పటికీ ఫలితం కలగలేదు

అని భ్రమపడుతూ ఉంటాం అనేక సమయాలలో.

కాని స్థిరంగా ఆలోచించి చూసినట్లయితే లోపం మన దృష్టిలోకి వస్తుంది. ఆ లోపాన్ని సరిదిద్దుకుని పరిపూర్ణ ప్రయత్నం చేసి చూడాలి - అది ఎటువంటి కార్యమయినప్పటికీ.

ప్రయత్న లోపం లేనప్పటికీ, ఫలితం దైవానికి విడిచి పెట్టాలి తప్ప ఆత్మత్యాగమే పరిష్కార మార్గంగా భావించరాదు.

ప్రస్తుత సమాజంలో ప్రతి సమస్యకీ పరిష్కారం ఆత్మహత్య మాత్రమేనన్న ధోరణి ఎక్కువగా కనబడుతున్నది మనకి.

పరీక్షలో ఉత్తీర్ణులు కాకపోతే ఆత్మహత్య.

ఉద్యోగం రానట్లయితే ఆత్మహత్య.

కోరుకున్న వ్యక్తితో వివాహం కాకపోతే ఆత్మహత్య.

అయినదానికీ, కాని దానికీ, ప్రతి చిన్న విషయానికీ ఒక్కటే మార్గం - ఆత్మహత్య.

త్వరపడి ఆత్మహత్యా నిర్ణయానికి వస్తున్నారే తప్ప సమస్య ఏ విధంగా పరిష్కరించి ఫలితాన్ని సాధించగలుగుతున్నాం అని ఆలోచించడం లేదు. ఒక్కసారి ఆత్మత్యాగం చేసిన తరువాత సాధించడానికి మిగిలేది ఏమీలేదు.

తమ సమస్యకి ఆత్మత్యాగం పరిష్కార మార్గం అని హనుమంతుడు భావించినప్పటికీ త్వరపడలేదు.

ఒక్క క్షణంలోనే స్వస్తి పలికాడు ఆ ఆలోచనకి.

మరణించి సాధించగలిగేది ఏమీ లేదు, జీవించి ఉంటే ఏ నాటికయినా అమ్మవారిని దర్శించగలను అనుకున్నాడు.

అనుకుని ఎదురుగా దృష్టి సారించాడు.

అశోకవనం కనబడింది.

లంక అంతటా అన్వేషించడం అయిపోయింది అనుకున్నాడు. అనుకుని ఆత్మత్యాగానికి సన్నద్ధుడయాడు. కాని ధీమంతుడు కనక, ఆ ఆలోచనని ఎక్కువసేపు నిలవనీయలేదు.

నిలవనీయలేదు కనకనే అశోకవనంలో అన్వేషణ జరగలేదనే విషయాన్ని గమనించగలిగాడు.

అక్కడ అమ్మవారిని దర్శించగలిగాడు.

నిలవనిచ్చి ఉంటే సర్వనాశనమే !

స్థిరంగా ఆలోచించి అడుగు వేయాలి – అప్పుడే మనకి కూడా హనుమంతుని వలె కార్యసిద్ధి కలుగుతుంది.

**సీతాదేవితో**

పాతివ్రత్యమే రక్షణగా ఉన్న సీతాదేవిని చూచిన హనుమంతుడు మనసా రామలక్ష్మణులకు నమస్కరించి చెట్టుకొమ్మల మధ్య నుండి ఆ పతివ్రతా శిరోమణి వయిపే చూస్తున్నాడు, ఆవిడతో మాట్లాడే అవకాశం కోసం నిరీక్షిస్తూ.

తెల తెల వారుతున్నది.

రావణుడు వచ్చి, మరొక రెండు మాసాల లోపుగా మనసు మార్చుకుని తన అంతఃపురానికి రానట్లయితే మృత్యులోకానికి పంపుతానని బెదిరించి వెళ్ళాడు.

తమ ప్రభువు వెళ్ళగానే సీతాదేవి చుట్టూ వున్న రాక్షస స్త్రీలు ఆమెకు నచ్చజెప్పడానికి విఫల ప్రయత్నాలు చేశారు.

గమనిస్తూనే ఉన్నాడు హనుమంతుడు.

రాక్షస స్త్రీలందరూ ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుతూ, హింసిస్తూ ఉంటే సీతాదేవి కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. త్రిజట రాక్షస స్త్రీలను వారిస్తూ తన స్వప్న వృత్తాంతం వినిపించింది వారికి. అది విన్న రాక్షస స్త్రీలు మూర్ఛపోయారు.

అప్పుడు సీతాదేవి – నాకు మరణం తప్ప గత్యంతరం లేదు. ఈ రావణ రాక్షసుని చేతిలో మరణించడం కంటె ఆత్మహత్య మేలు. ఈ కేశపాశంతో ఉరిపోసుకుని మరణిస్తాను, అనుకుంటూ జుట్టుముడి విప్పి

మెడచుట్టూ తిప్పుతూ నెమ్మదిగా లేచి పక్కనున్న చెట్టుకొమ్మ పట్టుకుని నిలబడింది.

క్షణాలలో ప్రాణత్యాగం చేయబోతున్నది.

చెట్టుమీద నుండి చూస్తున్న హనుమంతుడు –

ఇప్పుడు నేను ఈవిడకు ఆశ్వాసన కలిగించాలి. సీతాదేవి ఆత్మహత్యా యత్నాన్ని ఆపాలి. ఆవిడ ప్రాణత్యాగం చేశాక రామలక్ష్మణ సుగ్రీవాదులు వచ్చి ప్రయోజనమేమిటి?

సరే నేనిప్పుడు ఈవిడతో ఏ భాషలో మాట్లాడాలి. సంస్కృతంలో మాట్లాడుదునా, అది ద్విజుడయిన రావణుని వాక్కుగా, వాడే కామరూపుడుగా వచ్చాడని సీత శంకించకుండా ఉంటుందా! శంకించినా నేను మరే భాష మాట్లాడినా ఈవిడ మరీ భయపడుతుందే! ఆ భయంతో గట్టిగా రోదిస్తే రాక్షస వీరులు ఆయుధాలతో రావచ్చు. నేను తప్పించుకోవడానికి ప్రయత్నిస్తే వారు యుద్ధానికి దిగుతారు. అప్పుడు దాని పరిణామం ఎలా ఉంటుందో తెలియదు. వారు నన్ను బంధించినా వధించినా నా శ్రమ పూర్తిగా వ్యర్థం. ఈ వార్త అక్కడకు అందించే వారుండరు. అందుచేతనే దూతలు సమయోచితంగా ప్రవర్తించకపోతే సర్వమూ నాశనమే అవుతుందని ఆర్యులంటారు. నేను సంస్కృతంలోనే రాఘవుని గుణగణాలను కీర్తిస్తూ నా ప్రసంగం ప్రారంభిస్తే జానకీదేవి ఉత్సాహంతో వినవచ్చు, అని బాగా యోచించి

“రాజా దశరథో నామ రథకుంజర వాజిమాన్...”

అని ఆరంభించాడు.

అవిస్తరం అసందిగ్ధం

అవిలంబితం హృదయ హర్షిణీన్.

అయిన వాక్కు హనుమంతునిది అని శ్రీరామచంద్రుని చేత ప్రశంసలు పొందినవాడు. అటువంటివాడు ఈ సన్నివేశంలో ఎలా ప్రారంభించాడు తన సంభాషణను.

ఆ ప్రారంభాన్ని చూస్తే మనసు పులకించి, బుద్ధి ప్రఫుల్లమవుతుంది. గుండె జలదరిస్తుంది.

అయోధ్యానగరాన్ని దశరథుడనే రాజు పాలిస్తున్నాడు. ఆయన కీర్తి ముల్లోకాల్లో వ్యాపించింది –

మొదటి మాట వింటూనే సీతాదేవి తన ఆత్మత్యాగ ప్రయత్నాన్ని విరమించి, తల పైకెత్తింది.

నిమేష కాలంలో తన ప్రసంగం ఎలా ప్రారంభించాలో నిశ్చయించుకోగలిగిన ధీమంతుడు.

అదీ ఎటువంటి నిశ్చయం –

ఆ నిశ్చయంతో సీతాదేవి నిశ్చయం మారాలి.

మార్చగలిగాడు హనుమంతుడు.

కనకనే హనుమంతుడు ప్రథమ పరిచయంలోనే అంతగా రామభద్రుని ఆకర్షించగలిగాడు.

చెట్టుకొమ్మల సందుల నుండి చూస్తూ ఆయన ఆ క్షణం వరకూ జరిగిన సీతారాముల కథ అంతా అయిదారు క్షణాలలో సంక్షిప్తంగా వినిపించాడు.

దశరథుడనే మహారాజు అయోధ్యానగరాన్ని పాలిస్తున్నాడు. చతురంగబల సమన్వితుడయిన ఆ మహారాజు ధర్మపరుడు. వారి జ్యేష్ఠ పుత్రుడు రాముడు. ఆయన సదాచార పరాయణుడు, స్వజన రక్షణ తత్పరుడు, సర్వజీవలోక రక్షణ దీక్షితుడు, సత్యసంధుడు. ఆ రామచంద్రుదు పితృవాక్పాలనకై దండకాటవికి వచ్చాడు. అక్కడ జనస్థానంలో ఖరదూషణులను వధించాడు. అది విని రావణుడు రాముని భార్యను అపహరించాడు మాయలేడి ద్వారా ఆయనను వంచించి. భార్యాన్వేషణలో ఆయన కిష్కింధకు వచ్చి వానరరాజు సుగ్రీవునితో స్నేహం చేసుకుని వాని అన్న వాలిని వధించాడు. అనంతరం సుగ్రీవుని ఆజ్ఞానుసారం లక్షల వానరులు సీతాన్వేషణకు దశదిశలకు బయలుదేరారు. దక్షిణ దిశగా వచ్చిన వానరులు సంపాతి సాయంతో సీత

లంకలో ఉన్నట్టు తెలుసుకున్నారు. వారిలో ఒకడయిన వాయునందనుడను నేను ఈ సముద్రం దాటి వచ్చాను – అని చెప్పి మౌనం వహించాడు.

నెమ్మదిగా తనవైపే చూసే జానకీదేవి మనసు గ్రహించి హనుమంతుడు క్రిందికి దిగి నమస్కరించి :

తల్లీ ఈ చెట్టు నీడన నిలబడి ఎందుకు విచారిస్తున్నావు? ఎవరి ఇంటి బిడ్డవు?

నా కంటికి దేవతా స్త్రీలా కనబడుతున్నావు;

తల్లీ ! చంద్రుని వీడి వచ్చిన రోహిణివా?

వసిష్ఠుల వారిమీద కోపగించి లేదా వారిని అనుమానించి విడిచి వచ్చిన అరుంధతివా?

అమ్మా! కన్నీరు విడుస్తున్నావు. నిట్టూర్పులు వదులుతున్నావు. నీ పాదాలు భూమిని తాకుతున్నాయి. ఈ లక్షణాలనుబట్టి చూస్తుంటే నీవు దేవతా స్త్రీవి కావని తెలుస్తోంది. నీలో రాచరికపు లక్షణాలు కనిపిస్తున్నాయి. జనస్థానంలో రావణుడు అపహరించిన జానకీదేవివి కాదు కదా– అన్నాడు.

ప్రసంగాన్ని ప్రారంభించిన విధానం, దానిని కొనసాగించిన సరళి చూస్తే –

మొదట ఆ ఇల్లాలిని గురించి తనకేమీ తెలియనట్లు ఆరంభించాడు.

నెమ్మదిగా వసిష్ఠుల వారి ఇల్లాలితో పోల్చి ఆమెను పతివ్రతా శిరోమణిగా గుర్తించినట్లు మాట్లాడాడు.

చివరకు రామపత్నివి కాదు కదా అన్నాడు.

అలాకాక –

ఒక్కసారిగా సీత ముందు నిలబడి – అమ్మా నీవు రామపత్నివే కదా, నేను నిన్ను వెదకడానికి రాముడు పంపగా వచ్చిన దూతను –

అని రెండు మాటల్లో చెప్తేస్తే కార్యం జరిగిపోదా?

అమ్మా నువ్వు రామపత్నివే అని ప్రారంభించినట్లయితే –

వాక్యం ముగిసేలోగా ఆ మహాసాధ్వి ఆత్మహత్య చేసేసుకుంటుంది.

ఎందుచేతనంటే అప్పటికి పది మాసాలుగా ఆ ఇల్లాలు లంకలోని రాక్షసుల నోట నిరంతరం రామదూషణే వింటోంది. వారి కామరూప శక్తి గమనిస్తోంది. ఎవ్వరి మాటనూ వినే స్థితిలో లేదావిడ మనస్సు. అదీకాక అక్కడి రాక్షసీ జనంలో దశరథ మహారాజు పేరు కానీ, అయోధ్య విశేషాలు కాని ఎరిగినవారు లేరు, రాముడి పేరు తప్ప.

రాముడి వంశ సంకీర్తనం ప్రారంభం కాగానే తప్పకుండా తన ఆత్మీయులెవరో వచ్చారని గ్రహిస్తుంది సీతాదేవి.

గ్రహించి తన ప్రయత్నం విరమిస్తుంది.

విరమించిన తరువాత ఆవిడ ఎదుట నిలబడి,

రామసందేశం అందించవచ్చు. అని ఆలోచించాడు.

ఆలోచన ఫలించింది.

ఆత్మహత్యా ప్రయత్నం ఆగింది.

ఇలా ప్రతిచోటా, ప్రతి మాటా ఎలా మాట్లాడాలో మనకి చూపిస్తూనే ఉంటాడు, రామాయణం అంతటా హనుమంతుడు.

* * *

హనుమంతుని మాటలు వింటోంది అమ్మవారు.

నెమ్మదిగా ఆవిడ దగ్గరకి అడుగులు వేస్తున్నాడు అంజనానందనుడు.

వింటున్న అమ్మవారికి శంక కలిగింది – ఇది రావణ రాక్షసుని మాయాజాలమేనేమో అని.

అతి జాగ్రత్తగా ఆలోచించి, ఆమెకి ప్రీతికరంగా మాట్లాడినప్పటికీ, ఆవిడ మనసు శంకాదూరం కాలేదు. అంటే అనాలోచితంగా హనుమంతుడు – ''అమ్మా, నువ్వు రామపత్నివా'' అంటూ హఠాత్తుగా ప్రత్యక్ష మయినట్లయితే, నిస్సందేహంగా సందేహించేది జానకీదేవి.

ఆవిడకి సంపూర్ణ విశ్వాసం కలిగిస్తూ రామచంద్రుని అంగుళీయకాన్ని అందించాడు హనుమంతుడు.

అందించి, "అమ్మా ఇంతెందుకు, నువ్వు నా భుజస్కంధం మీద

కూర్చోతల్లీ, ఈ క్షణంలో నిన్ను రామచంద్రుని దగ్గరకు చేరుస్తాను" అన్నాడు.

అప్పుడు జానకీదేవి – "నాయనా అంగుష్ఠమాత్రం లేవు. నన్ను సముద్రం దాటించి ఎలా తీసుకువెడతావు? ఒకవేళ తీసుకు వెళ్ళగలిగినా, దారిలో నేను సముద్రంలో జారి పడవచ్చు. అప్పుడు నన్ను భీకర జలచరాలు కబళించాయనుకో! నీ ప్రయత్నమంతా వ్యర్థమే కదా. కాక నీ మీదకి రావణుడు రాక్షస సేన పంపితే, వారి నుండి రక్షించడం మాటలు కాదు.

మరొక్క కారణం ఉంది. నా భర్తను తప్ప మరొక పురుషుని దేహాన్ని నేను స్పృశించను. మరి రావణుడు నిన్ను తెచ్చినపుడేం చేశావంటావు. అప్పుడు వాడు నన్ను బలాత్కారంగా తెచ్చాడు. నేను వివశురాలనై ఉన్నాను. అందుచేత రామచంద్రుడు స్వయంగా వచ్చి ఈ రాక్షసులను సంహరించి నన్ను తీసుకు వెళ్ళడమే శ్రేయస్కరం. అంతేకాని పిరికితనంతో పారిపోవడం నాకు నచ్చదు" అన్నది.

సమాధానంగా హనుమంతుడు :

అమ్మా నీ మాటలు సముచితంగా ఉన్నాయి. యీ విధంగా మాట్లాడడం నీ వంటి సాధ్వీమణులకే తగును.

నీ మాటలు స్త్రీ సహజమయిన స్వభావాన్ని కూడా వ్యక్తం చేస్తున్నాయి. నూరు యోజనాల సాగరలంఘనం కనక నీ భయం సహజం.

అయితే నా శక్తి విషయంలో నీ సందేహం అనవసరం, అంటూ అంతవరకూ పిల్లి పిల్లలా ఉన్నవాడు దివ్యప్రభలు విరజిమ్మే మేరువులా అయాడు.

మండుతున్న అగ్నిముఖం, వజ్ర సమమయిన దంష్ట్రలు, నఖములు ఆ రూపంతో –

అమ్మా! ఇప్పుడు నమ్మకం కలిగిందా నేను ఈ ద్వీపాన్ని సహితం కదిలించగలనని. అందువలన రాక్షసులు నన్నేదో చేస్తారనడం సృష్టిలో జరిగేది కాదు. మరొకమాట అన్నావే, రామభద్రుని తప్ప మరొక పురుషుని గాలి కూడా సోకనివ్వనని. ఆ మాట నువ్వు మాత్రమే అనగలవు. మరెవ్వరూ

అలా అనలేరు. రామచంద్రుని వంటి మహాత్ముని భార్యకే ఆ శక్తి ఉంటుంది.

నిజమే నువ్వన్నట్లుగా ఆయన వచ్చి ఈ రాక్షస వంశ నాశనం చేసి నిన్ను తీసుకువెళ్ళడమే ఆయన వీరత్వానికి లక్షణం అన్నాడు.

హనుమంతుడితో సముద్రం దాటి రాముని చేరడానికి అభ్యంతరం చెప్పింది సీతాదేవి. అందుకు రకరకాల కారణాలు వ్యక్తం చేసింది ఆవిడ. వాటిలో కొన్ని ఆవిడ మనసుకి, పాతివ్రత్యానికి సంబంధించినవి.

అమ్మా నువ్వు స్త్రీవి కనక భయపడుతున్నావు. అని –

పరపురుష స్పర్శ విషయానికి వస్తే నీ ఎదుట లోకం తలవంచ వలసిందే అని, ఆవిడ వ్యక్తం చేసిన అభ్యంతరానికి అంగీకరించాడు.

తన శక్తిని శంకించి రాక్షసులేదో చేస్తారని సీతాదేవి సందేహించి నపుడు మాత్రం, ఆ పరాభవాన్ని సహించి ఊరుకోలేదు, నేను సేవకుణ్ణి కదా అని.

ఆగ్రహించనూ లేదు అవమానానికి ప్రతిగా.

తన శక్తి ఎరుగదు కదా అని ఒక్కసారి తానేమిటో చూపించాడు.

అదీ హనుమంతుని ధీశక్తి. అయిన దానికీ, కాని దానికీ తాళం వాయించి వంది మాగధ కృత్యానికి దిగే సేవకుడు కాదాయన. తన వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటూ, ఎదుటి వారి శక్తిని గౌరవించగలవాడు.

* * *

రామచంద్రుడే స్వయంగా వచ్చి రాక్షస సంహారం చేసి తనను తీసుకువెళ్ళాలని చెప్పిన తరువాత సందేహం వ్యక్తం చేసింది సీతాదేవి – వానరసేనా సహితంగా రామలక్ష్మణులు సాగర లంఘనం చేసి లంకలో ప్రవేశించడం ఎలా అని.

ఆవిడ సందేహాలు దూరం చేస్తూ హనుమ – అమ్మా! మా ప్రభువు సుగ్రీవుడు చెయ్యలేని సాహసం లేదు. ఆయన కృతనిశ్చయుడయి ఉన్నాడు. మనోవేగంతో సాగగల వానర భల్లూక సేనలు ఆయన కనుసన్నలలో కదలి వస్తాయి. నదీనద సాగర పరివృత్తమయిన ఈ భూమండలమంతా వారు

ఎన్నో మారులు ప్రదక్షిణం చేసి వచ్చారు. దూత కార్యానికి నా వంటి అల్పులను పంపుతారు తప్ప, మహామహులని నియమించరు. అక్కడి యూధపతులు నన్ను మించిన వారు, నాతో సమానులు, నా కంటె తక్కువ వారు లేరు.

మద్విశిష్టాశ్చ తుల్యాశ్చ
సంతి తత్ర వనౌకసః
మత్తః ప్రత్యవరః కశ్చిన్
నాస్తి సుగ్రీవ సన్నిధౌ

అహం తావదిహ ప్రాప్తః
కింపునస్తే మహాబలాః
నహి ప్రకృష్టాః ప్రేష్యంతే
ప్రేష్యంతే హీతరే జనాః

వారంతా వచ్చి ఈ లంకనూ, రాక్షస గణాన్నీ సర్వనాశనం చేస్తారు. అత్యల్పకాలంలో నువ్వు రామచంద్రుని చూడగలవమ్మా. ఈ జగత్తులో రామలక్ష్మణులతో సమానులయినవారు లేరు. అగ్ని వాయువులె వారిద్దరూ విజృంభిస్తే ప్రపంచం గజగజలాడుతుంది. కొద్దిరోజులమ్మా నీకింక ఈ దురవస్థ – అని ధైర్య వచనాలు పలికాడు.

హనుమ మాటలు విన్న సీతాదేవి, నాయనా! పెరుగుతున్న పంటచేనుకి వానజల్లులా నా మనస్సు నీ మాటలతో ఆనందభరిత మయ్యిందయ్యా! అన్నది.

అదే హనుమంతుడు ఆశించిన ప్రయోజనం.

సాగరాన్ని లంఘించి, లంకలో సీతాన్వేషణకై బయలుదేరడానికి ఎవరిశక్తి వారు తెలియచేసినపుడు శతయోజనాలూ లంఘించగలమని అన్నవారు ఒక్కరూలేరు, హనుమ తప్ప. అదేమాట సీతాదేవితో అన్నట్లయితే ఆవిడ ఎదుట అంజనా పుత్రుని సామర్థ్యానికి కావలసినంత గుర్తింపు లభిస్తుంది. దానితోపాటు సేనాసమేతంగా రామలక్ష్మణులు లంక చేరలేరనే నిశ్చయానికి

వచ్చేస్తుంది. ఆవిడ, నిరాశతో తన ఆత్మహత్యా ప్రయత్నం పూర్తి చేస్తుంది. కార్యం విఫలమవుతుంది.

సముద్రతీరానికి తమ యోధులందరూ కలిసి మార్గం అన్వేషించగలరనే విశ్వాసం హనుమంతునికి ఉన్నది. ఆ మాట స్థిరంగా తెలియచెయ్యక అనిశ్చితంగా, సందేహాస్పదంగా చెప్పినట్లయితే ఎదుటి వ్యక్తికి నమ్మకమూ, ధైర్యమూ కలగవు. ఇప్పుడు కావలసినదే మనోధైర్యం. ఆ ధైర్యం కలిగించడానికి ఏ విధంగా పలకాలో తెలిసినవాడు హనుమంతుడు. సుగ్రీవుని సైన్యంలో తనకంటె తక్కువశక్తి కలవాడు ఒక్కడూ లేడు, అని చెప్పడానికి కూడా సందేహించలేదు.

నిజానికి శక్తిలో రామలక్ష్మణులకి సాటి రాగలవాడు హనుమంతుడు.

అవకాశం దొరికితే చాలు ఎదుటివారికి తన శక్తి సామర్థ్యాల ప్రసంగాలతో వేధించుకుతినేవాడు కాడు హనుమంతుడు. ఇప్పుడు కావలసినది తన శక్తి సామర్థ్యాల ప్రదర్శన కాదు, అని గ్రహించగలవాడు కనుకనే అలా మాట్లాడగలిగాడు.

## రాక్షస సేనతో

జానకీదేవికి ధైర్యవచనాలు చెప్పి, ఆవిడ ఇచ్చిన చూడామణిని గ్రహించి, తిరుగుముఖం పట్టి సాగరలంఘనానికి బయలుదేరబోతూ –

మనం వచ్చిన పని కొంచెం మిగిలినట్లు అనిపిస్తున్నది. సీతాదేవిని చూశాను, అయితే యీ ఇల్లాలిని చూడడంతో అయిందా?

రావణుడు సీతాదేవిని రామచంద్రునికి అప్పగించడు.

తామస ప్రకృతి కల రాక్షసులు సామమార్గాన లొంగిరారు. సిరిసంపదలతో మునిగి ఉన్న వీరిని దానంతో దారికి తీసుకురాలేము. పరాక్రమ సంపన్నులయిన వీరి బలగర్వం భేదోపాయానికి లొంగదు. ఇక మిగిలింది దండనీతి, పరాక్రమ ప్రదర్శనమే; అంటే యుద్ధం తప్పదు.

ముందు ఈ రాక్షసుడి అంగబలం, ఆయుధబలం తెలుసుకోవాలి.

అప్పుడు యుద్ధానికి వస్తే అవలీలగా కార్యం సాధించగలం. దూతగా వచ్చినవాడు తనకు తన ప్రభువు ఆజ్ఞాపించిన పని యొక్క పూర్వాపరాలు కూడా పూర్తిచెయ్యకుండా వెడితే ప్రయోజనం లేదు.

వీరి శక్తి తెలుసుకోవాలంటే ముందు మన శక్తి ప్రదర్శించి వారిని రంగంలోకి దింపాలి. దింపి కొందరు యోధులను నేలకూల్చాలి. అప్పుడు కాని మూలస్తంభాలు కదలిరావు. ఇంత జరిగాక తిరిగివెళ్లాలి. అని నిశ్చయించుకున్నాడు.

రావణునికి ప్రియమయిన అశోకవనం ధ్వంసం చెయ్యడం మొదలు పెట్టాడు.

వార్త విన్న రావణుడు తనతో సమానబలం కల కింకర గణాన్ని హనుమంతుడితో యుద్ధానికి పంపాడు.

తరువాత జంబుమాలి, మంత్రి పుత్రులు, సేనానులయిన విరూపాక్ష, యూపాక్ష, దుర్ధర, ప్రఘస, భాసకర్ణులు, అక్షకుమారుడు.

ఇలా ఒకరి తరువాత ఒకరిని
రావణుడు పంపాడు
హనుమంతుడు చంపాడు
అన్నట్టుగా సాగింది ఆ యుద్ధం.
తిరిగి వెళ్ళి రావణుడికి ముఖం చూపించినవాడు ఒక్కడూ లేడు.

* * *

సుమారు మూడు వందల శ్లోకాలలో సాగిన ఈ రాక్షస సంహార కాండలలో హనుమంతుని నోటవెలువడిన మాటలు అయిదారు కంటే లేవు. మిగిలినదంతా ఆయన సాగించిన శత్రుసంహార వర్ణనా విశేషమే.

ఒకరిని చంపినట్లు ఒకరిని చంపడు.
అటువంటి విచిత్ర యుద్ధం సాగిస్తాడాయన.
హనుమంతుడు పలికిన పలుకులు –

జయత్యతి బలో రామో
లక్ష్మణశ్చ మహాబలః
రాజా జయతి సుగ్రీవో
రాఘవేణాభి పాలితః

దాసోహం కోసలేంద్రస్య
రామస్యాక్లిష్ట కర్మణః
హనుమాన్ శత్రుసైన్యానాం
నిహంతో మారుతాత్మజః

న రావణ సహస్రం మే
యుద్ధే ప్రతిబలం భవేత్
శిలాభిస్తు ప్రహరతః
పాదపైశ్చ సహస్రశః

అర్ధయిత్వా పురీం లంకాం
అభివాద్య చ మైథిలీం
సమృద్ధార్థో గమిష్యామి
మిషతాం సర్వ రాక్షసాం

అతిబల మహాబలులయిన రామలక్ష్మణులకూ, మా ప్రభువు సుగ్రీవునకూ జయం.

ఏ ఘన కార్యమయినా, ఏ మాత్రం శ్రమపడకుండా అవలీలగా చేయగల రామభద్రుని దాసుడనైన నేను వాయునందనుడను, శత్రుసైన్య నాశకుడను. మహావృక్షాలు పెకిలించి విసురుతూ, రాళ్ళవాన కురిపిస్తూ యుద్ధం సాగిస్తూంటే వేలమంది రావణులు నా ఎదుట నిలవలేరు.

ఈ లంకానగరాన్ని నాశనం చేసి, కార్యసాధన తృప్తితో, జానకీదేవికి అభివాదం చేసి, రాక్షసులందరూ కన్నులప్పగించి చూస్తూంటే హాయిగా తిరిగి వెడతాను.

దశ నాగబలాః కేచిత్ కేచిద్దశ గుణోత్తరాః

కేచిన్నాగ సహస్రస్య బభూవుస్తుల్య విక్రమాః

సన్తిచౌఘబలాః కేచిత్ కేచిద్వాయు బలోపమాః ।

నేయమస్తి పురీలంకా నయూాయం నచ రావణః ॥

ఓ రాక్షస యోధులారా మీరు నన్నే చూస్తున్నారు. మా సుగ్రీవ ప్రభువు కనుసన్నలలో ఇట్టి వేల లక్షల యోధులున్నారు.

పది ఏనుగుల, వంద ఏనుగుల, వెయ్యి ఏనుగుల బలం కలవారున్నారు.

వారు పరాక్రమించి వస్తే, మీ లంకా నగరం మిగలదు, మీరూ ఉండరు, మీ ప్రభువూ ఉండడు అని, నన్ను మించిన వానర యోధులు రాబోతున్నారు, అని వారికి భీతి కలిగించాడు.

తన ప్రభువు శక్తి, ఆయన అనుచరుల సామర్ధ్యం తెలియ చెయ్యడానికి మాత్రమే ఆ మాటలు వాడాడు.

తా నేమిటో చేతలలోనే ప్రదరిశంచాడు.

ఎంతటి శూరత్వం ప్రదర్శించాడంటే,

రావణుడు స్వయంగా –

దానిని సామాన్యమయిన కోతిగా భావించకండి జాగ్రత్తగా వ్యవహరించండి. ఇదివరలో నే నెందరో వానరులను చూశాను. వారి బలపరాక్రమాలు ఎరుగుదును. అవక్ర పరాక్రమంకల మైందద్వివిదుల సాహసం కూడా ఇంతటిది కాదు. వీడి ఆకారం, ధీరత్వం, ధీశక్తి, ఉత్సాహం సామాన్యంగా లేవు. ఒక మహా భూతమేదో వానర రూపంలో దిగి ఉంటుంది.

దృష్టాహి హరయః పూర్వం

మయా విపుల విక్రమాః

వాలీచ సహ సుగ్రీవో

జాంబవాంశ్చ మహాబలః

నీలః సేనాపతిశ్చైవ
యేచాన్యే ద్వివిదాదయః
దైవం తేషాం గతిర్భీమా
న తేజో న పరాక్రమః

న మతిర్న బలోత్సాహౌ
న రూప పరికల్పనమ్
మహత్సత్వ మిదం జ్ఞేయం
కపిరూపం వ్యవస్థితమ్

జాగ్రత్తగా నడిచి ఆ వానరాన్ని బంధించండి, అని తన వారిని హెచ్చరించవలసి వచ్చింది.

శూరుడూ, శత్రువూ అయిన రాజు నోట ఇటువంటి పలుకులు పలికించగలిగే శూరత్వం హనుమంతుడిది.

ధీ ధీర ఉత్సాహాలలో అందరికీ ఆదర్శప్రాయుడు ఆంజనేయుడు.

* * *

**రావణునితో**

పంపిన వారినందరినీ హనుమంతుడు చంపడంతో గత్యంతరం లేక ఇంద్రజిత్తుని వదిలాడు లంకేశ్వరుడు. దేవేంద్రుని గడగడలాడించిన ఇంద్రజిత్తు తికమకపడ్డాడు, హనుమంతుని ఏమీ చెయ్యలేక :

గత్యంతరం లేక బ్రహ్మాస్త్రంతో బంధించి రావణుని ఎదుట నిలబెట్టాడు ఇంద్రజిత్తు.

హనుమంతుని తేజస్సు చూసిన రావణుడు –

కి మేష భగవాన్నందీ
భవే త్సాక్షాదిహాగతః
ఏన శస్తోస్మి కైలాసే
మయా సంచాలితా పురా

వాయం వానరమూర్తిః
స్యాత్కింస్వి ద్భాజోపివాసురః

ఎవడు వీడు, ఈ తేజస్సు చూస్తుంటే అలనాడు కైలాసాన్ని కదిలించినపుడు ఆగ్రహంతో నన్ను శపించిన నందీశ్వరుడిలా రాలేదు కదా. కాకుంటే బాణాసురుడు వానర రూపంతో దిగాడా, అనుకున్నాడు.

శత్రువు కూడా ఓహో అనగల తేజస్వంతుడు హనుమంతుడు.

శత్రువే అయినప్పటికీ వానిలోని గుణాన్ని గుణంగా స్వీకరించి, అవగుణాన్ని అవగుణంగా ఖండించగల సద్గుణవంతుడు హనుమంతుడు.

రత్న మాణిక్య ఖచిత సువర్ణ సింహాసనం మీద సర్వ భూషణా లంకృతుడై, కిరీటధారియై వెలుగుతున్న రావణుని చూడగానే –

అహోరూప మహోధైర్యం
అహో సత్వ మహోద్యుతిః
అహో రాక్షస రాజస్య
సర్వ లక్షణ యుక్తతా
యద్యధర్మో నబలవాన్
స్యాదయం రాక్షసేశ్వరః
స్యాదయం సురలోకస్య
స శక్రస్యాపి రక్షితా ॥

ఓహో ఏమి వీని సౌందర్యం! ఏమి ధైర్యం.

ఏమి శక్తి, ఏమి శరీరకాంతి! సర్వలక్షణ లక్షితుడై అలరారే ఈ రాక్షసేశ్వరుడు దేవేంద్రునితో పాటు అమరావతిని కూడా ఏలతగ్గవాడే, కాని పరస్త్రీ వ్యామోహమనే అధర్మం ఒక్కటే వీనిని ఎందుకూ కాకుండా సర్వనాశన పథంవైపు నడిపించింది, అనుకున్నాడు.

రావణుని తేజస్సుని మెచ్చుకోవడానికి వెనుకాడలేదు. శత్రువులో అన్నీ లోపాలనే చూడగలగడం మిత్రుడిలో మంచిలక్షణాలనే చూడడం సామాన్యుల లక్షణం. ఎదుటి వ్యక్తితో మనకి ఎటువంటి సంబంధం

ఉన్నప్పటికీ, మంచిని మంచిగా, చెడుని చెడుగా చూడగలగడం ఉత్తముల లక్షణం. అటువంటి ఉత్తమ గుణవంతుడు హనుమంతుడు.

ముందుగా మనిషి ఆకృతి చూడగానే కలిగిన ఆశ్చర్యాన్ని ప్రకటించాడు. ఉత్తర క్షణంలో రావణునిలోని దుర్గుణాలు గ్రహించి, మనోనేత్రంతో చూచి, రావణుని నాశనాన్ని ఊహించాడు.

కంటికి కనిపించే రూపానికి, మనస్సు చూసే రూపానికి ఎంత భేదం ఉంటుందో ఈ సన్నివేశంలో బోధిస్తాడాయన మనకు.

మనిషిని చూడగానే నిర్ణయానికి రాకు. మనిషియొక్క అంత రంగాన్ని గ్రహించు – అనేది మనం ఇక్కడ గ్రహించగలిగితే అకారణంగా అధములని అందలాలు ఎక్కించి అవమానాల పాలు కానవసరం లేదు.

* * *

రావణుడు తన మంత్రి ప్రహస్తుని వైపు తిరిగి, వీడెవడో, వీడి కథేమిటో కనుక్కోమన్నాడు.

సమాధానంగా మారుతి :

మీ ప్రశ్నలు చాలా అయోమయంగా ఉన్నాయి. నా ముఖం చూస్తే తెలియడం లేదా, నేనెవరినో.

ఇక నేనెందుకొచ్చానని అడుగుతున్నారు.

నేను వానరాన్ని, వానర లక్షణంతోనే వచ్చాను. ఇక్కడ మంచి మంచి వనాలున్నాయి, మధురమయిన ఫలాలు దొరుకుతాయి, అని వచ్చాను. వచ్చాక మీ ప్రభువుని చూడాలనిపించింది, ప్రభుదర్శనం సామాన్యులకు లభించాలంటే ఏదో పాడుపని చెయ్యాలి. అందుకే అశోకవనం ధ్వంసం చేశాను. మీ వాళ్లు నన్ను చంపడానికి వచ్చారు ఆత్మరక్షణార్థం వారిని సంహరించక తప్పలేదు. ఆత్మరక్షణ కోసం ఎవరయినా చేసేపనే కదా ఇది– అన్నాడు.

శబ్ద బ్రహ్మవేత్త, వాక్యవిశారదుడు, ధీమంతుడు అని రాముని చేత ప్రశంసలు పొందిన హనుమంతుడు రావణుని ముందు సాగించిన ప్రసంగంలో పూర్వభాగం ఇది.

దీన్ని పరిశీలిస్తే –

ముందుగా, రావణుని ఉద్యానవనాలను ప్రశంసించాడు. ఎంతటి వాడయినా ప్రశంసలకి లొంగకుండా ఉండడు. ఆ ప్రశంసతో వాని ఘనతకి నీరాజనం పట్టి సుముఖం చేసుకున్నాడు.

అనంతరం రాజదర్శనం కోసం ఆదుర్దా వ్యక్తం చేసి మరింత లొంగదీశాడు.

తను చేసిన రాక్షస సంహారానికి కారణం ఆత్మరక్షణ అన్నాడు.

తతస్తే రాక్షసాః ప్రాప్తా
బలినో యుద్ధ కాంక్షిణః
రక్షణార్థం తు దేహస్య
ప్రతియుద్ధా మయారణే

న్యాయస్థానంలో నిలబడినవాడు తను నేరం చెయ్యడానికి కారణం ఆత్మరక్షణ అని ఋజువు చేసుకుంటే వానికి శిక్షపడదు. అది శిక్షా స్మృతిలో నియమం.

సర్వశాస్త్ర విశారదుడయిన హనుమంతుడు శిక్షాస్మృతిని అవగతం చేసుకున్నవాడు కనకనే యీ ప్రసంగాన్ని ఇలా కొనసాగించాడు. అటువంటి క్లేశం ఎదురయినపుడు మనం ఎలా మాట్లాడాలో ఉపదేశించాడు.

అంత వివేకంగా ప్రసంగం ప్రారంభించి, రావణుని ఆగ్రహం తగ్గించిన అనంతరం :

నేను సుగ్రీవ సచివుడను, రామదూతను, మా మహారాజు పంపిన సందేశాన్ని నీకు వినిపించడానికి వచ్చాను.

ప్ర ప్రథమంగా నీ సోదరుడుగా ఆయన నీ యోగక్షేమాలు అడగమన్నాడు, అని మొదలుపెట్టి.

రావణా నీకు తెలియని విషయం కాదు. మా వానర ప్రభువు వాలి. ఆయనను నువ్వు బాగా ఎరుగుదువు. ఆయనను ఒక్క బాణంతో నేల కూల్చిన మహాయోధుడు రామభద్రుడు.

త్వయా విజ్ఞాత పూర్వశ్చ
వాలీ వానర పుంగవః
రామేణ నిహతః సంఖ్యే
శరేణైకేన వానరః

ఒకనాడు రావణుని తన చంక కింద బిగించి సప్తసముద్రాలలో ముంచి విడిచిన బలశాలి వాలి, అంతటివాడు రాముడు విడిచిన ఒక్క బాణంతో నేలకూలాడు, అనడంతో రావణుని ధైర్యం చల్లబడాలి. అదీ హనుమంతుని మాటలోని చాకచక్యం.

సీతాన్వేషణ భారాన్ని స్వీకరిస్తానని రామచంద్రుని కిచ్చిన వాగ్దానాను సారం మా ప్రభువు సుగ్రీవుడు వానరయోధులందరినీ నలుదిక్కులకూ పంపాడు.

మా వానర యోధులెంతటివారో ఎరుగుదువా?

గరుత్మంతునితో సమంగా ఎగరగలవారు కొందరు, వాయు వేగంతో పోగలవారు కొందరు.

అందరూ భూమ్యాకాశాలలో తీవ్రగమనంతో సాగగలవారే.

నన్ను హనుమంతుడంటారు.

శతయోజన విస్తీర్ణమున్న సముద్రాన్ని దాటి నీ లంకానగరంలో ప్రవేశించి సీతాదేవిని దర్శించాను.

లంకేశ్వరా! నీకు ధర్మం తెలియదని నే ననుకోవడం లేదు. మహా తపస్సంపన్నుడవనీ, ప్రాజ్ఞుడవనీ విన్నాను.

నీ వంటి ధీమంతులు ధర్మమార్గాన్ని విడిచి విపత్తులు తెచ్చుకోకూడదు.

పరదారాపహరణం మహాపాతక హేతువు.

రామలక్ష్మణులు ధనుర్బాణధరులై నిలబడితే సురగరుడోరగ యక్ష కిన్నర దానవగణాలు నిలబడలేవు.

మర్యాదగా ఆయన భార్యను ఆయనకు అప్పగించు.

ఆ మహనీయుడెవరో నీకు తెలిసినట్లు లేదు.

మానవరూపంలో భూమికి దిగిన దివ్యస్వరూపుడు.

ఈ మాటలేవీ నీకు రుచించకపోతే ఈ ఒక్కమాట సావధానంగా విను.

నేను సీతాదేవిని చూశాను. మిగిలిన దానిని ఆయన అవలీలగా పూర్తి చేస్తాడు.

దృష్టాహీయం మయాదేవి
లబ్ధం యదిహ దుర్లభం
ఉత్తరం కర్మ యచ్ఛేషం
నిమిత్తం తత్ర రాఘవః

దేవదానవ గరుడ గంధర్వ కిన్నర కింపురుషులెవ్వరూ నిన్ను సంహరించలేరు. కాని నరవానరులయిన రామసుగ్రీవులు వస్తున్నారు.

నిన్నటివరకూ నీ ధర్మకార్యాల ఫలాన్నీ, నీ తీవ్ర తపశ్శక్తి యోగాన్నీ అనుభవించావు. అది పూర్తి కాబోతున్నది.

జానకీదేవిని అపహరించిన అధర్మఫలాన్ని అనుభవించక తప్పదు.

చివరగా ఒక్కమాట విను.

జనస్థానంలో నీ సహచరులయిన రాక్షస యోధులందరూ కోదండ శరవర్షంలో మునిగిపోయారు. మహాబలిష్ఠుడయిన వాలి నేలకూలిన వార్త కూడా విన్నావు.

ఈనాడు మా ప్రభువయిన సుగ్రీవుడు రామునితో స్నేహం చేశాడని నేను చెప్పినది నీకు వినిపించి ఉంటుంది.

జనస్థాన వధం బుధ్వా
బుధ్వా వాలి వధం తథా
రామసుగ్రీవ సఖ్యంచ
బుధ్యస్వ హిత మాత్మనః

ఇప్పుడు నీ శ్రేయో మార్గమేమిటో ఆలోచించుకో.

రాముని క్రోధాగ్నీ, సీతామహాదేవి పాతివ్రత్య తేజాగ్నీ ఈ రెండూ లంకానగరాన్నీ, నిన్ను సర్వనాశనం చేస్తుంటే నీ కళ్ళతో నీవు చూడక తప్పదు.

తప్పాలంటే నా హితోపదేశం విను.

లేదూ –

చతుర్ముఖుడూ, ఫాలలోచనుడూ, సహస్రాక్షుడూ – వీరెవరూ రాముని ముందు నిలవలేరు. ఆయన ధనుర్ధారియై నిలబడితే వీరిలో ఎవ్వరూ నీకు రక్షణ ఇవ్వలేరు.

బ్రహ్మా స్వయంభూః చతురాననోవా
రుద్ర స్త్రినేత్ర స్త్రిపురాంతకోవా
ఇంద్రో మహేంద్రః సురనాయకోవా
త్రాతుం నశక్తాయుధి రామవధ్యం

రామభద్రుడు శరణాగత వత్సలుడు. ఆయన భార్యను ఆయనకు అప్పగించి పాదాలమీద పడు, అనుగ్రహిస్తాడు.

సాహస పరాక్రమాలుండగానే సరిపోదు, దయా హృదయం, క్షమాగుణం ఉండాలి.

మన వీర శూరత్వాలను అందరి మీదా ప్రయోగించ కూడదు. సాధు, సజ్జన, నారీ రక్షణం వీరలక్షణం కావాలి, అని వ్యంగ్యంగా హితబోధ చేశాడు.

ఇక్కడ చాలా సుదీర్ఘ ప్రసంగం చేశాడు హనుమంతుడు. లంకానగర సౌందర్యాన్ని పొగుడుతూ, రావణుని ఆవేశాన్ని చల్లబరిచాడు. చల్లబడితేగాని, హనుమంతుడు చెప్పే మాటలు వినే స్థితిలోకి రాడు రావణుడు.

సావధానంగా వినే స్థితిలోకి తీసుకువచ్చిన తరువాత నెమ్మదిగా తనని పరిచయం చేసుకున్నాడు.

రాముని శూరత్వాన్ని తెలియజేయడానికి రావణుని గుండెజారే వాలి పేరు చెప్పాడు మొదట.

తరువాత రావణునిలోని గుణాలనూ, అవగుణాలనూ ప్రస్తావిస్తూనే

రాముని వీరత్వాన్ని చాటాడు. సీతాదేవిని తిరిగి రామచంద్రునికి అప్పజెప్పనట్లయితే జరిగే పర్యవసానం ఎలా ఉంటుందో కనులకు కట్టినట్లు వర్ణించాడు. హితవు చెప్పాడు.

ఆయన ప్రసంగ శైలి ఎంతటిదీ అంటే –

అంతటి ఆగ్రహంలో ఉన్న రావణుడు కూడా వింటూ మౌనంగా ఉండిపోయాడు.

మొదటిసారి రాముడు హనుమంతుని చూసినపుడే అన్నాడు, కత్తిదూసి మీదికి వచ్చే శత్రువైనా, ఇతడి మాటలు వింటే చేతులు జోడించాలి. "ఉద్యతాసేర రేరపి" – అని. అందుకు నిదర్శనం ఈ సన్నివేశం.

అదీ వాక్య విశారదుని ప్రసంగ నైపుణ్యం.

కొంతసేపటికి కానీ తాను వింటున్నదేమిటో తెలిసే స్థితిలోకి రాలేకపోయాడు రావణుడు.

**తనతో తాను**

ప్రతిపక్షులతో, మిత్రులతో మాట్లాడిన సందర్భాలే కాక ఆత్మవిమర్శన విషయంలో కూడా హనుమంతుడు మనకు ఆచార్యత్వం వహిస్తాడు.

లంకా దహనం చేసేశాక విచారంలో పడ్డాడు. ఆగ్రహావేశంలో ఎంత పొరపాటు చేశాను. ఈ దహనకాండలో అశోకవనం కూడా అగ్నికి ఆహుతయి సీతాదేవికి అపాయం సంభవించి ఉంటే భవిష్యత్తు ఏమిటి?

రావణుని మీద క్రోధంతో ఈ దారుణానికి తలపడ్డాను. సర్వ నాశనం చేసుకున్నాను.

క్రుద్ధః పాపం నకుర్యాత్కః క్రుద్ధో హన్యాద్గురూనపి
క్రుద్ధః పరుషయా వాచా నరంః సాధూనధిక్షిపేత్.

క్రోధానికి లొంగినవాడు చెయ్యలేని చెడ్డపని లేదు. దానికి లోబడ్డామో,

సాధువులను హింసించగలం

గురువులను హననం చేయగలం

పరుష వాక్కులతో కర్కశంగా చరించగలం.

అందుచేతనే కామక్రోధాలకు లొంగని మహనీయులు ధన్యులు అనుకుంటాడు.

హనుమంతుని వంటి ధీశాలి, పరాక్రమవంతుడు సైతం కోపానికి లొంగితే ఎంతటి అనర్థం జరుగుతుందో చెపుతూనే సామాన్యులు క్రోధానికి ఎంత దూరంలో ఉండాలో బోధిస్తుంది ఈ సన్నివేశం.

ఆగ్రహం, ఆవేశం వహించినప్పుడు తొందరపడి ఎలా చరిస్తామో, దానివల్ల కలిగే అనర్థాలేమిటో, అలానే సంతోషంలో కూడా పూర్వాపర వివేకాలు కోల్పోయి ప్రవర్తించే విధానం కూడా చూస్తాం. అయినా ఆరంభించిన కార్యానికి విఘాతం కలుగకుండా చూసుకోవడం హనుమంతుని వంటి వానికే సాధ్యం. అటువంటి సాధకుని గురువుగా గ్రహించి ఆయన చర్యలను, వాక్కులను అవగాహన చేసుకుని ఆచరించగలిగితే మనం కూడా కొంతలో కొంత ఉత్తమగుణ సంపన్నులమై ఆత్మ శ్రేయస్సును, లోక కళ్యాణాన్ని సాధించగలుగుతాం.

సీతాదేవికి అపాయం సంభవించి ఉంటే... అని విచారిస్తున్న హనుమంతునికి అంతలోనే మరో ఆలోచన కలిగింది.

నేను పొరబడుతున్నాను. మంగళ రూపిణి అయిన సీతాదేవిని అగ్నిహోత్రుడు అంటలేడు.

ఆమె తేజస్వరూపిణి, అగ్నిని అగ్ని ఏం చెయ్యగలదు.

సీతారాముల ప్రభావంచేత కాకపోతే ఇంతగా జ్వలించిన అగ్ని నా తోకను వేడెక్కించలేదే అనుకున్నాడు.

ఒక్కమారు అమ్మవారిని చూసి వెళ్ళాలని నిశ్చయించుకుని, శింశుపావృక్షం చేరి, ఆ ఛాయలో వసివాడకుండా ఉన్న సీతాదేవిని దర్శించి తిరుగు ప్రయాణానికి సన్నద్ధుడయాడు.

బయలుదేరి రామబాణంలా సాగుతూ సముద్రతీరానికి కొంత దూరంలో ఉండగా సింహగర్జన చేశాడు.

ఆ ధ్వని వింటూ సముద్రతీరానికి ఈవలి ఒడ్డున ఉన్న వానర వీరులందరూ ఆశ్చర్యంతో జాంబవంతుని చుట్టూ చేరారు.

వారందరినీ దగ్గరగా పిలిచి –

నాయనా – మీరు నిర్భయంగా ఉండండి. మన మారుతి కార్యసాధకుడై తిరిగి వస్తున్నాడు. అదే ఆ ధ్వని. కార్యసాధకుడు కానివాడు అటువంటి సింహగర్జన చేయలేడు; అని ఓదార్పు పలికాడు.

ఇక్కడ ఒక ప్రధానాంశం ఉన్నది.

హనుమంతుడు తిరిగివస్తూ అంత భయానకమయిన సింహనాదం చేయడం దేనికీ అని శంక కలుగుతుంది. సరాసరి వచ్చి విషయం చెప్పవచ్చు కదా.

నిజమే. తిరిగి వచ్చి అందరికీ తన కార్యసాధన వార్త వివరించ వచ్చు.

సామాన్యంగా ఎవరయినప్పటికీ చేసేపని అదే.

కాని....

నిన్న ఉదయం బయలుదేరిన హనుమంతుడు ఈ రోజు సాయంత్రానికి వస్తున్నాడు. బయలుదేరిన క్షణం నుంచి, నీల, గజ, గవయ, గవాక్ష, గంధమాదన, మైంద, ద్వివిధ, అంగదాదులందరూ అన్నపానాలు ముట్టకుండా ఆయన రాకకోసం ఎదురుచూస్తున్నారు.

హనుమంతుడు వచ్చి సీతను చూశాను, అంటే తప్ప వీరెవ్వరికీ మనశ్శాంతి లేదు.

సీతను చూడకుండా వస్తే సర్వవానర యోధులకూ శిరచ్ఛేదమే శిక్ష, అని సుగ్రీవుని ఆజ్ఞ.

హనుమంతుడు సీతాదర్శనం చేసి రాకపోతే వీరెవరి ప్రాణాలూ ఉండవు.

అందుకే తాను కార్యం సాధించుకు వచ్చాననే భావం వ్యక్తం చేయడానికి సింహనాదం చేశాడు, అంతదూరం నుంచి.

అయితే ఆ సింహనాదం కారణం అర్థం చేసుకోగల వారుండాలి కదా! అనే సందేహం సామాన్యుడికి కలుగుతుంది.

తెలుసుకోగల జాంబవంతు డున్నాడని హనుమంతుడికి తెలుసు.

దూరం నుండి సింహనాదం చేసిన హనుమంతుడు తన ఆప్తమిత్రుల మధ్యకు దిగుతూ –

"దృష్టా సీతా" అన్నాడు.

చూశాను సీతని అని ఆరంభించాడు.

సీతని చూశాను, అని ఆరంభించవచ్చు. సీతని అని ప్రారంభించగానే, చూశాను అంటాడో, చూడలేదు అంటాడో అనే ఉత్కంఠ భరించలేని కొందరి గుండెలు ఆగిపోవచ్చు.

అక్కడున్న వారిని చూడడం ప్రధానం.

"చూశాను" అనగానే సీతాదేవినే అనే విషయం అక్కడున్న వారందరూ గ్రహించగలిగినదే.

ఏ మాటను ఎప్పుడు ఎక్కడ ఎలా ప్రారంభించాలి ప్రసంగంలో అనే శబ్దబ్రహ్మ విద్య సాధించినవాడు హనుమంతుడు, అని శ్రీరామచంద్రుడు అనడానికి కారణం ఇక్కడ కూడా తెలుస్తుంది.

సీతా దృష్టా అన్నప్పటికీ వ్యాకరణం, ఛందస్సు ఏవీ దెబ్బతినవు. కాని 'సీతా' శబ్దం కంటె ముందు దృష్టా అని తన వారందరికీ ఒక లిప్తకాలం ముందుగా సంతోషం కలిగించిన ధీమంతుడు హనుమంతుడు.

## ఎవరితో ఎంత?

గగనవీధి నుండి హనుమంతుడు కిందికి దిగిన అనంతరం వానర యోధులందరూ ఆయనను పరమ సంతోషంతో సత్కరించారు.

అప్పుడు జాంబవంతుడు

నాయనా ఎలా వెళ్ళావు? అక్కడి విశేషాలేమిటి? పరమ క్రోధుడైన రావణుని కథ ఏమిటి? అంటూ ప్రశ్నపరంపర నడిపించాడు.

తాతా మీరందరూ చూస్తూండగా మహేంద్రగిరి నుండి బయలు దేరాను. దారిలో మైనాకుడు అడ్డువచ్చి అతిథి సత్కారం చేస్తానన్నాడు. ఇప్పుడు కాదని ముందుకు సాగాను. సురస ఎదురుపడి మ్రింగుతానంది. తెలివిగా తప్పించుకున్నాను. లంకా నగరం సమీపిస్తుండగా ఛాయాగ్రాహిణి సింహిక తన శక్తితో నన్ను లాగబోయింది. ఒక్క దూకులో దాని కడుపులో ప్రవేశించి కీళ్ళు సడలించి, పైకిలేచి, లంకానగరం కోట గోడమీద దిగాను. చీకటి పడుతుండగా లంకలో దిగి అన్ని భవనాలూ తిరిగాను. చివరకు అశోకవనంలో అమ్మవారిని దర్శించాను. ఆనవాలుగా ఆవిడ చూడామణి ఇచ్చింది. అప్పుడు బాగా ఆలోచించి అశోకవనం ధ్వంసం చేశాను.

రావణుడు తన సేనలు పంపాడు వారిని నేలకూల్చాను. వాని పుత్రుడు అక్ష కుమారుని కూడా యమసదనం చేర్చాను. వాడు రాక్షసులను పంపడం, నేను చంపడం అంతే.

చివరకు ఇంద్రజిత్తు వచ్చాడు. వీడు వాడి పెద్దకొడుకు. మహా మాయావి. అస్త్ర శస్త్ర విద్యలలో ఘటికుడు వాడు బ్రహ్మాస్త్రంతో బంధించి రావణుని ముందు నిలబెట్టాడు. ఆ దుర్మార్గుడు నన్ను చంపమని ఆజ్ఞాపించాడు. కాని వాని తమ్ముడున్నాడు, ధర్మాత్ముడు విభీషణుడు. అతడు హితబోధ చేయగా చివరకు నా తోకకు నిప్పు ముట్టించమన్నాడు రావణుడు.

నా తోకచుట్టూ గుడ్డలు చుట్టబెట్టి నూనెతో తడిపి అంటించారు. మండుతూన్న తోకతో లంకను భస్మంచేసి ఇలా వచ్చాను.

ఇలా తన ప్రయాణంతో ప్రారంభించి తిరిగి వచ్చే వరకూ జరిగిన గాధను, తాను సాధించిన విశేషాలనూ సుమారుగా రెండు వందల శ్లోకాలలో వివరిస్తాడిక్కడ హనుమంతుడు.

కాని, సీతాదేవి రామచంద్రునికి చెప్పమన్న విషయాలు వీరి దగ్గర ప్రస్తావించలేదు.

అదే హనుమంతుని వివేకం.

రామునికి చెప్పవలసిన మాటలు వీరికి అనవసరం కనక ప్రస్తావన రానివ్వడు.

కిష్కింధ చేరాక.

వానరులందరరూ చూశాం సీతను, చూశాం సీతను అని హర్షధ్వానాలు చేస్తుంటే రాముడు, మీలో చూసిన వాడెవడో నా దగ్గరగా రండి, అనగానే అందరూ హనుమంతుణ్ణి ముందుకు పంపారు.

అప్పుడు హనుమ.

స్వామీ చూశాను సీతను

నిన్నే స్మరించుకుంటూ నీ మీదనే మనసుంచి జీవిస్తున్నది. వికారాకారాలు కల రాక్షసీజనం ఆమె చుట్టూ కూర్చుని భయపెడుతున్నారు. జుట్టు దువ్వుకోకుండా కటిక నేలమీద పరుంటున్నది. రాక్షస రావణుని బాధ నుండి విరమింపజేసి, సుగ్రీవునితో మీ స్నేహం విషయము చెప్పాను.

అప్పుడావిడ నన్ను రామదూతగా నమ్మి, చిత్రకూటం మీద ఉన్న రోజులలో కాకాసురుని మీద బ్రహ్మాస్త్రం విడిచిన గాథ చెప్పింది. గోదావరీ తీరంలో మణిశిలతో తిలకం దిద్దిన విషయం చెప్పింది. ఈ చూడామణి ఆనవాలుగా ఇచ్చిది.

ఇంక నెలరోజుల కంటె జీవించనని చెప్పింది.

అప్పుడావిడకు నేను ధైర్యం కలిగించి వచ్చాను, అన్నాడు.

అంగద జాంబవంతుల దగ్గర చెప్పిన తన ప్రతాప ప్రదర్శన విషయాలేవీ ఇక్కడ చెప్పలేదు. పయిగా మొత్తం కథ అంతా పాతిక శ్లోకాలతో ముగించాడు.

అదీ ఆయన వివేకం. ఎవరికి ఎంత చెప్పాలో ఏది చెప్పాలో తెలిసిన ధీమంతుడు కనుకనే ఈ నాటికీ మనం ఆరాధిస్తున్నాం.

మన మిత్రుల దగ్గర, మనతో సమానుల దగ్గర మన విజయగాథలు వివరంగా చెప్పుకుని ఆనందాన్ని పంచుకోవచ్చు. మన పై అధికారుల దగ్గర, మనకంటే గొప్పవారి దగ్గర మనం చేసిన ఘన కార్యాల గురించి చెప్పుకోకూడదనే విషయాన్ని మనకు తెలియజేశాడు హనుమంతుడు.

హనుమంతుని మాటలు విన్న రాముడు –

ఇంతటి క్లేశమయిన కార్యాన్ని మారుతివంటి స్వామి సేవాపరాయణుడు తప్ప సాధించలేడు. వాయువో, వైనతేయుడో తప్ప సముద్రం అవ్వలి తీరం చేరడం మరెవరికీ ఊహకందనిది. పయిగా అప్రధృష్యమయిన లంకానగరం అంతా తిరిగి రావడం ఎవ్వరూ చెయ్యలేని పని. ప్రభువు ఆజ్ఞను సమయోచితంగా నిర్వర్తించి తృప్తి కలిగించే సేవకుడు ఉత్తముడు. చెప్పిన దానిని చెప్పినట్లే చేసేవాడు మధ్యముడు. చెప్పిన మేరకు చెయ్యలేనివాడు అథముడు. మన హనుమ ఉత్తమశ్రేణికి చెందినవాడు. అన్వేషణలో సఫలుడై వచ్చి మా రఘువంశాన్ని నిలబెట్టాడు. ఈ సమయంలో గాఢాలింగనం కంటె ఈ దూతకు నేను బహూకరించగలిగింది లేదు – అని గాఢాలింగనం చేసుకున్నాడు.

సీతాదేవికి మాత్రమే లభించే ఆలింగన భాగ్యాన్ని పొందిన మహనీయుడు హనుమంతుడు.

అంతకన్న ఏ సేవకుడికి మాత్రం కావలసినది ఏముంది.

* * *

యుద్ధానికి బయలుదేరడానికి ముందు, లంకానగర, దుర్గ విశేషమేమిటయ్యా, అని రాముడు హనుమంతుని ప్రశ్నించాడు.

రామభద్రా! లంకానగరానికి నాలుగుదిక్కులా నాలుగు ద్వారాలు, ఇనుముతో నిర్మించిన పరిఖలు. ఆ ద్వారాలకు అటూ ఇటూ గోడల మీద బండరాళ్ళను విసిరే యంత్రాలు కోటగోడల మీద శతఘ్నులు. శతఘ్నుల చుట్టూ వాటి ప్రయోగం తెలిసిన రాక్షసవీరులు. కోట గోడని ఆనుకుని అగడ్త, అగడ్తల మీద సంక్రాతాలున్నాయి. ఈ వంతెనలకు ఇరువైపులా

ఉన్న గృహాలలో యంత్రాలు వీటిని నియమిస్తూ ఉంటాయి. శత్రుభీతిని శంకించారో వంతెనలు ఎత్తుతారు. నిసర్గంగా, జలదుర్గం, వన దుర్గం ఉన్నాయి. శూలహస్తులూ, ఖడ్గపాణులూ అప్రమత్తులై నగర రక్షణలో ఉంటారు. నాలుగు ద్వారాలలో భీకరాకారులు వేలసంఖ్యలో రక్షణ కార్యంలో ఉంటారు.

నేను అగడ్తమీద సంక్రాతాలు ధ్వంసం చేసి, పరిఖలు నేలకూల్చి, ప్రాకారాలు పడగొట్టి వారి సేనలో ఒక భాగాన్ని యమపురి చేర్చి వచ్చాను. అని వివరంగా విశేషాలు చెప్పాడు.

దూతగా హనుమంతుడి కర్తవ్యం సీతా సందర్శనం మాత్రమే, కాని భవిష్యత్ కార్యక్రమానికి అవసరమయిన పనులన్నీ నిర్వహించాడు. హనుమంతుడు ధీమంతుడు కనుక.

చెప్పిన పని అంతవరకే చేసినవచ్చినట్లయితే, రాముడు ఇప్పుడడిగిన ప్రశ్నకి జవాబు ఉండేది కాదు అంజనానందుడికి.

సీతను మాత్రమే చూసివచ్చాను. అని చెప్పి, తలవంచవలసి వచ్చేది ఆయనకి.

తలవంచవలసిన అవసరం కలిగే వాడయితే ఉత్తమ దూతగా రామునిచేత ప్రశంసలు పొందగలిగేవాడు కాదు హనుమంతుడు.

నిర్దేశించిన కార్యానికి పూర్వాపరాలు గ్రహించగల జ్ఞాని కనుకనే, అశోకవన విధ్వంసం కారణంగా చూపించి, లంకానగర విశేషాలు గ్రహించే అవకాశం కలుగజేసుకోగలిగాడు.

❊ ❊ ❊

రామాయణంలో అనుక్షణమూ మనకి హనుమంతుడు ఎవరితో ఎప్పుడు ఎక్కడ ఎలా ఎంత మాట్లాడాలి – అనే అంశాన్ని సర్వదా సర్వదా పాటించాడు అనే విషయం కనబడుతూనే ఉంటుంది. తాను సాగించిన రాక్షస సంహార విషయాలు ఇంతవరకూ రాముడికి చెప్పలేదు హనుమంతుడు. సీతాన్వేషణ విషయం ప్రశ్నించినపుడు ఆవిడని చూసిన విషయం ఆ ఇల్లాలు

ఏ స్థితిలో ఉన్నది, ఆమె రాముడికి ఏం చెప్పమన్నది అన్న అంశాలు తప్ప మరోమాట చెప్పలేదు. లంకానగర దుర్గ విశేషాలేమిటి అని రాముడు అడిగాడు కనుక అక్కడి శత్రుబలం ఎంత ఉన్నదీ, అందులో తాను ఎంతమందిని సంహరించినదీ చెప్పాడు. ఇప్పటికీ అశోకవన విధ్వంసం విషయం, లంకాదహన విషయం చెప్పలేదు. సమయం సందర్భాలు ఎరుగకుండా పెద్దలముందు మన ప్రతాపం ప్రదర్శనం చెయ్యకూడదని ఎరిగినవాడు కనుక.

## వినయంతో

ప్రతి చిన్న విజయానికీ నా అంతటివాడు లేడంటూ విర్రవీగుతారు అజ్ఞానులు. అహంకారం మనిషిని ఎదగనివ్వదు, వినయం ఉన్నతినిస్తుంది. వినయం – వ్యక్తికీ, వ్యక్తిత్వానికీ వన్నెతెచ్చే, పెట్టని అలంకారం. ఎన్ని ఘనవిజయాలు సాధించినా వినయాన్ని వీడలేదు హనుమంతుడు –

❊ ❊ ❊

హనుమంతుడి తోకకి నిప్పు పెట్టించాడు రావణుడు. తోక నుండి జ్వాలలు ఆకాశానికి లేస్తున్నాయి.

అంతగా మండుతున్నప్పటికీ హనుమంతునికి చల్లగా ఉంది మంట.

క్షణం ఆలోచించాడు.

ఇంత మంట మండుతున్నా నాకేమీ బాధలేదే

ఏమిటి దీనికి కారణం?

రాముని ధర్మదీక్ష

సీతాదేవి పాతివ్రత్య శక్తి

అందుకు తోడు అగ్నిదేవునికీ, మా తండ్రి వాయుదేవునికీ ఉన్న స్నేహం కారణంగా ఈ వేడి నన్ను బాధించడం లేదు అనుకున్నాడు.

ఏదైనా ఘనకార్యం సాధించే ప్రయత్నం చేసినపుదు విజయం

సాధిస్తే అది తమ శక్తి ద్వారా సాధించామనీ, పరాజయం పొందితే దైవం అనుకూలించలేదనీ అనడం సామాన్యుల లక్షణం.

కాని, హనుమంతుడు అదంతా తన ప్రతాపం అని మీసాలు దువ్వి భుజాలు ఎగరవేయలేదు. ఏ మంచి జరిగినా అది సజ్జన సాంగత్యం వల్ల, వారి అనుగ్రహం వల్ల, తన తల్లిదండ్రుల పుణ్యవిశేషం వలన జరిగిందని భావించే ఉత్తమ స్వభావం కలవాడు హనుమంతుడు.

అలాకాక అంతా నా శక్తి అని అహంకారానికి లొంగిన వారు మూర్ఖులు, లొంగకుండా ఉన్నవారు హనుమంతు లవుతారు. అఖిల జగదారాధ్యు లవుతారు. కాని వారు కాని వారే.

* * *

యుద్ధం మొదలయ్యింది.

సంగ్రామం సాగుతోంది.

కుంభకర్ణుడు నేలకూలాడు.

ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రం రామలక్షణ సుగ్రీవులతో వానర భల్లూక యోధులందరినీ మూర్ఛితులను చేసింది. ఆ అస్త్ర శక్తికి లొంగనివారు విభీషణ హనుమంతులు. వీరిద్దరూ రణరంగం అంతా తిరుగుతూ ఎవరు ఏ దశలో ఉన్నారో చూస్తూ జాంబవంతుని సమీపించారు.

విభీషణుడు నెమ్మదిగా జాంబవంతుని చెవిలో – తాతా! ఎలా ఉన్నావు? అనగా ఆ వృద్ధ యోధుడు –

నాయనా వార్ధక్యం వలన ఆ బాణాఘాతం నా చూపును మందగింపజేసింది. అయినా నీ కంఠస్వరాన్ని బట్టి నువ్వు విభీషణుడవను కుంటున్నాను. ఇంతకూ అంజనానందుడు మారుతి కుశలంగా వున్నాడా అని ప్రశ్నించాడు.

విభీషణుడు, "తాతా! రామలక్ష్మణుల విషయం కాని, మీ ప్రభువు సుగ్రీవుని విషయం కాని అడగకుండా, మారుతి ఒక్కడిని గురించీ అడుగుతున్నావేమయ్యా" అని ప్రశ్నించాడు.

విభీషణా, వాడొక్కడు బ్రతికి ఉంటే ఈ మహాయోధులందరూ హతులయినా బతికించగలం, వాడులేడో వీరందరూ ఉన్నా లేనట్లే అన్నాడు జాంబవంతుడు.

తస్మిన్ జీవతి వీరేతు
హతమప్య హతం బలం
హనుమత్యుజ్ఝిత ప్రాణీ
జీవంతోపి మృతానయం.

ఆ మాటలు వింటూనే హనుమంతుడు జాంబవంతుని పాదాలకు ప్రణామం చేశాడు.

తతో వృద్ధ ముపాగమ్య నియమేనాభ్య వాదయత్
గృహ్యా జాంబవతః పాదౌ హనుమాన్మారుతాత్మజః ॥

జాంబవంతుని పాదాలకు నమస్కరించిన హనుమంతుడు ఎంతటివాడు –

అప్పటికే సీతాన్వేషణలో కృతకృత్యుడై అందరి ప్రాణాలు నిలబెట్టినవాడు.

జాంబవంతుడు, "నాయనా బ్రహ్మాస్త్ర ప్రభావితులైన వీరందరి ప్రాణాలూ నువ్వు రక్షించాలి. తక్షణం బయలుదేరి హిమగిరిమీద కైలాస శిఖరం దగ్గర దివ్యకాంతులతో వెలిగే మృతసంజీవనీ, విశల్యకరణీ, సావర్ణ్య కరణీ, సంధానకరణీ అనే ఓషధులున్నాయి అవి తీసుకువచ్చి వీరందరినీ ఉద్ధరించాలి" అని పలకగానే, వెళ్ళి ఆ ఓషధులున్న గిరి శిఖరం పెళ్ళగించుకుని వచ్చినవాడు.

రావణుడు ప్రయోగించిన శక్తివలన నేలకు ఒరిగిన లక్ష్మణుని రక్షణార్థం మరోసారి ఓషధులు తీసుకువచ్చినవాడు.

ఈ రెండు సమయాలలోనూ హనుమంతుడు ఓషధులు తీసుకురానట్లయితే.....

ఇందరి శ్రమా

ఇంతటి శ్రమా

వృథా అయిపోయేది.

ఇక్కడ రామలక్ష్మణ సుగ్రీవులు విగత జీవులు కావడం, దానితో అక్కడ అయోధ్య, కిష్కింధలలో నరవానరులు లేకుండాపోవడం – ఇదే పర్యవసానం అయేది.

ఇందరిని ప్రాణాపాయ దశనుండి తప్పించగలిగిన శక్తిమంతుడు హనుమంతుడు –

అంతటి హనుమంతుడు జాంబవంతుని పాదాలకు నమస్కరించి తన వినయాన్ని ప్రదర్శించాడు తప్ప తన వల్ల ఇంత ఘనకార్యం జరిగిందని విర్రవీగలేదు.

హనుమంతుని వినయ సౌశీల్యానికి మరో ఉదాహరణ –

యుద్ధం అయిపోయింది.

సీతాదేవి అగ్ని పరీక్ష ముగిసింది.

అందరూ అయోధ్యకి ప్రయాణమయ్యారు.

మార్గమధ్యంలో భరద్వాజ మహాముని ఆశ్రమంలో ఆగింది పుష్పక విమానం.

అందరూ మహర్షికి నమస్కారాలు చేశారు. ఆయన అభయ హస్తముద్రతో అందరినీ పంపించాడు. చివరగా హనుమంతుడు వచ్చి ఆయన పాదాలమీద పడ్డాడు. అప్పుడు

మునియున్ మారుతి కౌగలించుకుని
సమ్మోదంబునన్ పల్కె అంతన
అబ్ధిన్ విపదబ్ధి దాటితివిన్ దాటించి తన్నన్
మహాముని! అప్పుడప్పుడు మీరు మీర్మునులు
అంభోయాన పాత్రీకృతాత్మ నితాంతోగ్ర
తపచ్ఛటా వితతి పంపన్ నేను గుర్తించితిన్

భరద్వాజుడు హనుమంతుని లేవనెత్తి దగ్గరగా హత్తుకుని నాయనా!

చాలా ఆనందంగా ఉంది నిన్ను చూస్తుంటే, శతయోజన విస్తీర్ణమైన దూరాన్ని దాటావు. సీతారాములను వియోగ సముద్రం నుండి దాటించావు. చాలా గొప్పవాడివి అన్నాడు.

హనుమంతుడు వినయంగా చేతులు జోడించి –

మహర్షీ, ఏమంటున్నారు మీరు? ఇదంతా నా గొప్పతనమా? మీ వంటి మహామునుల తపశ్శక్తి నన్ను తీసుకెళ్ళింది కాని, నేను సముద్రం దాటగల వాడినా? మీ అనుగ్రహంతో యిది సాధించాను, ఆశీర్వదించండి. అన్నాడే తప్ప, దర్పాన్ని ప్రదర్శించలేదు.

ఎంతటివారికయినా వినయం ఉత్తమ ఆభరణం. ఈ విషయంలో కూడా హనుమంతుడు మనకు ఆదర్శప్రాయుడే.

**విజయం**

సీతారాములు అయోధ్య చేరారు. వారితో పాటు విభీషణుడు, సుగ్రీవుడు, హనుమంతుడు, జాంబవంతాది ప్రముఖులంతా అయోధ్యకి విచ్చేశారు, పట్టాభిషేక మహోత్సవం తిలకించాలనే కుతూహలంతో.

పట్టాభిషేకం వైభవంగా ముగిసింది.

అందరికీ బహుమానాలు యిచ్చారు.

ప్రముఖు లనదగ్గ వారందరికీ సన్మానం జరిగింది.

ఒక్క హనుమంతుడికి మాత్రం ఏమీ ఇవ్వలేదు. అందరూ తెల్లబోయి చూస్తున్నారు. రాముడు సీతాసమేతంగా అయోధ్యకి తిరిగి రాగలిగాడంటే ప్రధాన కారకుడు హనుమంతుడు. అటువంటి హనుమంతునికి సన్మానం ఎందుకు జరగలేదో అర్థంకాలేదు అందరికీ. మరచారేమో అనుకోవడానికి వీల్లేదు – మరచిపోతగినవాడు కాడు కనక.

రెండు క్షణాలు రామభద్రుడు ప్రసన్న గంభీరంగా సభాసదులందరినీ తిలకించి –

చంద్రకాంతులీనే ముత్యాలహారాన్ని తన మెడనుంచి తీసి సీతాదేవికి అందించాడు.

ఆ ఇల్లాలు తెల్లబోయి రామచంద్రుని కన్నులలోకి చూసింది. రాముడు చిరునవ్వుతో.

ప్రదహీ సుభగే హారం
యస్యతుష్టా భామిని
పౌరుషం విక్రమాబుద్ధిః
యస్మిన్నేతాని సర్వశః ॥

జానకీ ఈ సదస్సులో నీ అభిమానానికి పాత్రులైన వారికి దీనిని బహూకరించు. ధీమంతుడు, ధీరుడు, పౌరుషవంతుడు అని ఎవరిని భావిస్తున్నావో వారికియ్యి, అన్నాడు.

అప్పుడు పట్టమహిషి సీతాదేవి రత్న సింహాసనం దిగి మందహాసంతో, ఆదరాభిమాన పురస్సరంగా ఆ హారాన్ని హనుమంతునికి బహూకరించింది.

ధీ ధీర శక్తులు కల హనుమంతుని వంటి స్వామి కార్య నిర్వహణాదక్షునికి, అందరితో కలిపి కాక ప్రత్యేక సత్కారం చేయించాడు, రామచంద్రుడు, హనుమంతుడు ఎటువంటి సన్మానాలూ ఆశించి కార్యనిర్వహణ చెయ్యనప్పటికీ.

ఏ వ్యక్తి అయినప్పటికీ ఒక కార్యాన్ని సాధించాలనుకున్నప్పుడు మనోవాక్కాయాలు మూడూ లగ్నం చేసి, దీక్షతో కృషిచేయాలి. కృషితో నాస్తి దుర్భిక్షమ్. సంపూర్ణంగా కృషి చేసినవాడు సాధించలేనిది లేదు. ఒక మహాకార్యాన్ని సాధించిన వారికి ఘనసన్మానం జరుగుతుంది. కార్య సాధనకి ముందునుండే, జరగబోయే సన్మానాల గురించి, అందుకోబోయే బహుమానాల గురించీ ఆలోచించే వారి దీక్ష వాటియందే వుంటుంది. కార్యసాధనయందు కాక. అటువంటి వారు ఏమీ సాధించలేరు, స్వప్నజగత్తులో విహరించడం తప్ప.

వీరిలో మొదటి కోవకు చెందిన హనుమంతుడు కార్య సాధకులకు ప్రథమ గురువు.

*   *   *

పశుపక్ష్యాదుల వలె కూడూ, గూడూ మాత్రమే మనిషికి చాలు అనుకోకుండా, మనిషై పుట్టినందుకు ఒక సత్కార్యం, ఒక మహత్కార్యం సాధించాలనుకునే వారికి హనుమంతుడు ఆదర్శప్రాయుడు.

ఆయన చేసే పనులు, సాగించే సంభాషణలు, ఆత్మవిమర్శలు, నిత్యం మననం చేసుకోగలిగితే సీతాన్వేషణ వంటి దుష్కర కార్యాన్ని సహితం సాధించగలం.

హనుమంతుని ప్రగాఢ సేవాధర్మాన్నీ, అగాధ ప్రతిభా సంపత్తినీ మనకు చూపించారు వాల్మీకి. మననం చేసుకుని, ఆచరించడం, సాధించడం మన వంతు.

*వందే లంకా భయంకరమ్.*

## వాగ్భూషణం భూషణం

ఉషశ్రీ చిన్నప్పుడు – ఆయన జాతకాన్ని చూసిన జ్యోతిశ్శాస్త్ర పండితుడు శ్రీధర వెంకయ్య గారు – "ఈ కుఱ్ఱాడి గురించి బెంగపడద్దు, నోరెట్టుకు బతికేస్తాడు" అని అన్నారట. ఆయన వాక్కు ఫలించింది – రెండు దశాబ్దాల పాటు – ఉషశ్రీ మాట – ఆంధ్రదేశమంతా మారుమోగింది. ఆ మాట ఇంకా బతికే ఉంది. దాంతో పాటే ఉషశ్రీ కూడా....

మాట విలువ తెలిసిన వారు ఉషశ్రీ – అందుకే – రామాయణంలో హనుమంతుణ్ణి – ఓ భక్తుడిగానో, ఓ వీరుడిగానో మాత్రమే కాక – శబ్దబ్రహ్మగా దర్శించ గలిగారు. తను చూసిన దాన్ని తన 'మాట' ద్వారానే అందరికీ అర్థం అయ్యేలా – అందంగా చెప్పగలిగారు.

రామాయణంలో హనుమంతుడు ఎక్కడ ఎవరి దగ్గర ఎంత మాట్లాడాలో – ఎలా మాట్లాడాలో బాగా తెలిసిన వాడు. సీతమ్మకి రాముడి క్షేమం చెప్పేడప్పుడైనా – రాముడికి సీత జాడ చెప్పేడప్పుడైనా – హనుమంతుడు చేసిన శబ్ద ప్రయోగం – రామబాణం అంత శక్తివంతమైంది.

ఏ కార్యనిర్వహణకయినా ముఖ్యంగా కావల్సింది బాగా మాట్లాడగల నేర్పు. అందుకే IIM లోనైనా –oxford లోనైనా – kellogs లోనైనా – ప్రపంచంలో ఏ మంచి business school లో ఐనా – కమ్యూనికేషన్ స్కిల్స్‌కి చాలా ప్రాముఖ్యం ఉంటుంది. ఇంజనీరింగ్ చేసిన విద్యార్థులు ఉద్యోగాల్లో రాణించడానికి finishing schools లో కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పిస్తున్నారు.

ఉద్యోగంలో చేరడానికి గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఉంటాయి. అందులో బాగా చెయ్యాలంటే మాట్లాడ్డం బాగా రావాలి. ఉద్యోగంలో చేరాక – నలుగురితోనూ బాగా మాట్లాడ్డం వచ్చిన వాళ్ళనే – విజయం వరిస్తూ ఉంటుంది. ఇళ్ళలో కూడా – మాటకారులు – అన్ని పనులూ సవ్యంగా చేసుకోగలుగుతారు. వాళ్ళు సంతోషంగా ఉంటూ – తమతో ఉన్నవాళ్ళనీ సంతోషంగా ఉంచగలుగుతారు.

కమ్యూనికేషన్‌లో చెప్పేవాడు, వినేవాడు అని ఇద్దరు ఉంటారు. తను చెప్పింది వినేవాడికి అర్థం అయ్యేట్లు చెప్పడం చెప్పేవాడి బాధ్యత. వినేవాడు సరిగ్గా వినలేదు అని చెప్పడం చాలా వరకూ తప్పించుకోవడం అవుతుంది.

అంటే చెప్పేవాడు వినేవాడి మానసిక స్థితిని అర్థం చేసుకోవాలి. ఏ స్థాయి వాడికి ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో ఆలోచించుకోవాలి. ఆ చెప్పే విషయాన్ని అర్థం అయేలా, అవసరం ఐతే ఆసక్తి కలిగేలా చెప్పాలి.

అందుకు మాట స్పష్టంగా ఉండాలి. భావం సూటిగా అవతలి మనిషికి అర్థం అయ్యేలాంటి మాటల్ని ఎంచుకోవాలి. అతను వింటున్నాడా లేదా, అతనికి అర్థం అవుతోందో లేదో అని పరిశీలిస్తూ ఉండాలి.

అందుకే వినేవాణ్ణి సూటిగా చూస్తూ మాట్లాడాలి. అతని ముఖకవళికల్నీ, బాడీ లాంగ్వేజ్నీ జాగ్రత్తగా పరిశీలించాలి. సందర్భానుసారంగా – చెప్పే విషయాన్నీ, విధానాన్నీ మారుస్తూ ఉండగలగాలి.

సామాన్యంగా భాషని సరళంగా హృదయానికి హత్తుకునేలా వాడాలి. అవసరం ఐతే కొంచెం హెచ్చుతగ్గులతో మాట్లాడగలగాలి. ఐతే ఆ అవసరాన్ని గుర్తించగలగాలి.

అలాగే గొంతు హెచ్చుతగ్గుల్నీ కూడా జాగ్రత్తగా చూసుకోవాలి. అవతల వాళ్ళకి వినపడనంత నెమ్మదిగానూ కాకుండా – అలాగని అందరికీ వినిపించేంత బిగ్గరగానూ కాకుండా – సమస్థాయిలో మాట్లాడాలి. సంభాషించేటప్పుడు – ఇవన్నీ ఆలోచించుకుంటూ – మాట్లాడేందుకు సమయం ఉండదు. అవతల వాళ్ళ మాటలు విని, వెంటనే స్పందించి, సమాధానం చెప్పడం రావాలి. అందుకు కావల్సింది అపారమైన సాధన.

సాధన ఎందుకు – ఇవన్నీ మనకి తెలిసినవే – కొన్ని తెలియకపోతే బిజినెస్ స్కూల్లోనో – మరోచోటో నేర్చుకోవచ్చు అని అనిపించచ్చు. ఐతే తెలియడం కాదు ముఖ్యం. ఆచరించడం, జీవితంలో భాగం చేసేసుకోవడం. జనం మధ్య ఏ మాత్రం ఆలోచించకుండా ఎలా నడిచెయ్యగలుగుతామో –

అలా ఎవరితోనైనా – ఎక్కడైనా – ఏ సందర్భంలో ఐనా – మాట్లాడ్డం వచ్చెయ్యాలి. అప్పుడు కార్యసాధన సులభం అవుతుంది.

అలాంటి కార్య సాధకుణ్ణి – మాట్లాడ్డంలో మనకు ఆది గురువుగా నిలపెట్టాడు ఆదికవి. ఈ రోజు కమ్యూనికేషన్ స్కిల్స్‌గా నేర్పిస్తున్న చాలా విషయాలు – హనుమంతుడి మాటల్లో కనిపిస్తాయి.

ఇతిహాస కాలం నాడయినా, ఈనాడయినా, ఏనాడయినా; ఇంటా బయటా ఎక్కడయినా మాటకీ, మాట్లాడే విధానానికీ ప్రాముఖ్యత ఉంటూనే ఉంటుంది.

సంభాషణా చాతుర్యం తెలుసు, అనవసర విషయాలు ప్రస్తావించడు, ప్రతి శబ్దం స్పష్టంగా ఉచ్చరిస్తూంటాడు, సాగతీతలతో విసుగు కలిగించడు, గొంతు చించుకోడు, తార మంద్ర స్థాయిల్లో కాక మధ్యమంలో, ఆంజనేయ స్వామిలా హాయిగా, హృదయాహ్లాదకరంగా మాట్లాడతాడు అని పేరు పొంది, తన 'మాట'తోనే విజయం సాధించిన ఉషశ్రీ, హనుమంతుడి నుండి మాట్లాడే విద్యని నేర్చుకోవాలి అని రాసిన ఈ పుస్తకం, మాటతో విజయం సాధించదలుచుకున్న వారందరికీ మార్గదర్శకం.

* * *

కేయూరాణి న భూషయంతి పురుషం హారాః న చంద్రోజ్వలాః
న స్నానం న విలేపనం న కుసుమం నాలం కృతా మూర్ధజా
వాణ్యేకా స మలం కరోతి పురుషం యా సంస్కృతా ధార్యతే
క్షీయంతే ఖలు భూషణాని సతతం వాగ్భూషణం భూషణం

నగలూ, సుగంధ స్నానాలూ, మైపూతలూ... వగైరాలేవీ మనిషికి నిజమయిన అలంకారాలు కావు. నశించి పోయే ఈ అలంకారాలని మించిన శాశ్వతమయిన అలంకారం చక్కని 'వాక్కు'. 'వాక్' భూషణమే నిజమయిన భూషణం.

# ఉషశ్రీ మిషన్

రామాయణ భారతాలు అందించే మానవత్వపు విలువలూ, సంస్కృతీ వైభవాలూ యువతరానికి తెలియజేయాలనే ఉషశ్రీ ఆకాంక్షే లక్ష్యంగా వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రారంభమైంది ఉషశ్రీ మిషన్

**మిషన్ కార్యక్రమాలు :**

- ఉషశ్రీ పుస్తకాలు ప్రచురించడం
- ఉషశ్రీ రామాయణభారత ఉపన్యాసాలు సి.డిలు. శ్రోతలకి అందించడం.
- ushasri.org నిర్వహించడం.
- పాఠశాల, కళాశాలల విద్యార్థులకి రామాయణ భారతాలు అంశాలుగా వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి, మన మహేతిహాసాల పట్ల వారిలో అవగాహన పెంచడం.
- భారతీయ సంస్కృతి, సాహిత్య రంగాలలో కృషి చేస్తున్న వారిలో ఏటా ఒకరిని 'ఉషశ్రీ సంస్కృతి సత్కారం'తో గౌరవించడం.

## శ్రీ ఉషశ్రీ పుస్తకాలని
## బంధుమిత్రులకి శుభాకాంక్షలతో పంచిపెట్టండి




### ఎవరితో ఎలా మాట్లాడాలి?

(రామాయణంలో హనుమంతుడు)

50 కాపీలు – రూ. 1600/–

100 కాపీలు – రూ. 2800/–

### "ధర్మసందేహాలు"

వెల రూ. 60/–

50 కాపీలు – రూ. 2400/–

100 కాపీలు – రూ. 4200/–

### శ్రీ వేంకటేశ్వర కల్యాణం

వెల రూ. 100/–

50 కాపీలు – రూ. 3000/–

100 కాపీలు – రూ. 5000/–



**ఎప్పుడు, ఎక్కడ, ఎవరితో, ఎంత మాట్లాడాలో తెలిసిన వాడు హనుమంతుడు.**

రామాయణంలో హనుమంతుని వెంట అనుదినం ఒకగంట తిరుగుతూంటే మన ధీశక్తి వికసించి దానిని ఎదుటివారికి తెలిపే సంభాషణ చాతుర్యం లభిస్తుంది. కిష్కింధలో హనుమత్ప్రవేశం నుండి యుద్ధకాండ చివర రామపట్టాభిషేక పర్యంతం ఈ ధీమంతుని వెంట సావధాన చిత్తులై నడవండి. కొంతలో కొంతయినా మాట్లాడేశక్తి అలవడుతుంది.

